
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురు) సా.6.21
సహరి (శుక్ర) ఉ.4.51



చెప్పతరమా.. ఉప్పుచేప!

- మాంసాహార వంటల్లో ప్రత్యేకం
- హోటళ్లలో, వేడుకల్లో స్పెషల్ డిష్
- ఉప్పాడలో భారీస్థాయిలో తయారీ
- విదేశాలకు సైతం ఎగుమతులు
- మత్స్యకార మహిళలకూ ఉపాధి

6

విజయ కేతనం!



- పిఠాపురం వేదికగా రేపే జనసేన 12వ రాష్ట్ర ఆవిర్భావ పండగ
- రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది వస్తారని అంచనా
- పిఠాపురంలో పవన్ అఖండ విజయం నేపథ్యంలో ఇక్కడే సభకు మొగ్గు
- సభకు జయకేతనంగా నామకరణం.. ద్వారాలకు మన ప్రాంతీయుల పేర్లే
- సభలో మహిళలు, మత్స్యకారులు, యువత, రైతు ప్రతినిధుల ప్రసంగాలు
- అటు ఉమ్మడి జిల్లా కేంద్రంగా అయిదేళ్లలో ఉవ్వెత్తున జనసేన పోరాటాలు
- అప్పటి అధికార వైసీపీపై ఇక్కడ నుంచే స్వయంగా పవన్ దండయాత్ర
- రైతు సౌభాగ్య దీక్ష నుంచి వారిని ఆదుకోవడం వరకు ఎన్నో మైలురాళ్లు
- అటు ఎన్నికల్లో సునామీ తీర్పుతో జనసేన వెంట నడిచిన గోదావరి జనం
- వైసీపీకి ఒక్క సీటూ రానివ్వనన్న పవన్ శపథాన్ని నిజం చేసిన గోదారోళ్లు
- జనసేన రాజకీయ చరిత్రలో ఉమ్మడి జిల్లాకు ఎప్పుడూ ప్రత్యేక స్థానమే





పిఠాపురం మండలం చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభ 'జయకేతనం' కోసం వేదిక.. డిప్యూటీ సీఎం పవన్ రాక నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వేదికగా జనసేన పార్టీ జయకేతన సభకు సర్వసన్నాహాలు చేస్తోంది. పిఠాపురం కేంద్రంగా పార్టీ 12వ రాష్ట్ర స్థాయి ఆవిర్భావసభకు కనివినీ ఎరుగని భారీ ఏర్పాట్లు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కనివినీ ఎరుగని సునామీ విజయం సాధించి ఉవ్వెత్తున ఎగసిన జనసేన తన విజయ ప్రస్థానాన్ని గోదావరి జిల్లా వేదికగా పంచుకోవాలన్న సంకల్పంతో ఇక్కడే సభను నిర్వహిస్తోంది. అటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అనేక ఆటుపోట్ల తర్వాత తొలిసారి ఎమ్మెల్యేగా విజయం రుచి చూసి రాష్ట్ర రాజకీయ దశ, దిశను గోదావరి జిల్లా నుంచే మార్చినందున పిఠాపురం ఎమ్మెల్యే హోదాలో సభను ఇక్కడే నిర్వహిస్తున్నారు. మరోపక్క జనసేన అంటే ఉమ్మడి తూర్పు అనేలా పార్టీ ప్రస్థానం గడచిన పన్నెండేళ్లలో సాగింది. పవన్ ఉద్యమాలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు.

అందరి దృష్టి ఇక్కడే...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభను శుక్రవారం పిఠాపురంలో అంచనాలకు మించి విజయవంతం చేసేందుకు ఆ పార్టీ ఎక్కడిక క్కడ పక్కా ఏర్పాట్లు చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో రెండు లక్షల మంది కూర్చునేలా ఏర్పాట్లు సిద్ధంచేస్తోంది. రాష్ట్రంతోపాటు తెలంగాణ, బెంగళూరు, చెన్నై తదితర రాష్ట్రాల నుంచి లక్షల మంది సభకు వస్తారని అంచనా. దీంతో స్వయంగా మంత్రి నాదెండ్ల కాకినాడలోనే మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే వీరికి ఎక్కడా ఏ ఇబ్బంది ఎదురు కాకుండా వేలాదిమంది పోలీసులు, అంబులెన్స్‌లు, భోజన వసతి కల్పిస్తున్నారు. అయితే తొలుత అమరావతిలో మూడు రోజులు నిర్వహించాలని భావించిన ఆవిర్భావ సభను ఆ తర్వాత గోదావరి జిల్లాకు మార్చారు. జనసేనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయంగా సెంటిమెంట్‌గా మారిన నేపథ్యంలో ఇక్కడి నుంచే తన విజయకేతన సభను నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో పవన్ సైతం సభావేదికకు విజయకేతన సభ అని స్వయంగా నామకరణం చేశారు. అలాగే సభకు మూడు ప్రవేశ ద్వారాలు ఏర్పాటుచేయగా, వాటికి పిఠాపురం రాజా శ్రీరాజా సూర్యారావు బహదూర్, విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్, అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మల పేర్లు పెట్టడం ద్వారా ఉమ్మడి జిల్లాకు తగిన ప్రాధాన్యం కల్పించారు. రాజకీయంగా ఇన్నేళ్లల్లో ఎన్నో ఆటుపోట్లను చూసిన జనసేనకు 2024 ఎన్నికలు కనివినీ ఎరుగని విజయాన్ని కట్టబెట్టడం, తొలిసారి అధికారంలోకి రావడంతో సాకారమైన కలను అచ్చొచ్చిన గోదావరి జిల్లా నుంచే పంచుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడే సభ నిర్వహిస్తున్నారు. దీంతో ఇప్పుడు రాష్ట్రంలో అందరి దృష్టి పిఠాపురంపైనే పడింది. తనకు రాజకీయంగా అండగా నిలబడుతోన్న గోదావరి జిల్లాలోని పిఠాపురం నుంచే 2024లో బరిలోకి దిగారు. అఖండ మెజార్టీతో విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా తిరుగులేని విజయం సాధించిపెట్టడంతో గోదావరి జిల్లాపై మరింత ప్రేమతో ఇక్కడి నుంచే తన విజయ ప్రస్థానం పంచుకోవాలని పవన్ భావిస్తున్నారు. అటు సభలో పిఠాపురంలో తనను గెలిపించిన ప్రజలకు పవన్ ధన్యవాదాలు తెలపనున్నారు. మరోపక్క సభ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానుంది. మొత్తం ఐదు గంటలపాటు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవన్‌కల్యాణ్ ప్రసంగంతో సభ ముగుస్తుంది.

పోరాటమే ఊపిరిగా..

జనసేన పార్టీ పుట్టిందే ప్రజాసమస్యలపై పోరుకోసం. పార్టీ ఆవిర్భావం నుంచి అధికారంలోకి వచ్చిన వరకు ఇన్నేళ్లలో ఎన్నో సమస్యలపై జనంకోసం జనసేన పోరాటాలు చేసింది. స్వయంగా పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అనేక సమస్యలపై పోరాటాలను తూర్పుగోదావరి జిల్లా నుంచే ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలు, అక్రమాలపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కదిలి అప్పటి సర్కారు వెన్నులో వణుకు పుట్టించారు. దీంతో జనం తమ సమస్యల కోసం ఎన్నోసార్లు జనసేనవైపు చూశారు. ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ పాలనలో అన్నదాతలు తీవ్రంగా నలిగిపోయారు. సాగునీటి నుంచి గిట్టుబాటు ధర వరకు సమస్యలే. దీంతో 2019 డిసెంబరులో కాకినాడ కేంద్రంగా రైతు సౌభాగ్య దీక్షతో ప్రభుత్వాన్ని కదిలించారు. రహదారుల గుంతలతో జనం పడుతున్న నరకయాతన నేపథ్యంలో ప్రభుత్వాన్ని కదిలించడం కోసం 2021 అక్టోబరులో రాజమహేంద్రవరంలో పవన్ పర్యటించారు. స్వయంగా రహదారులపై గుంతలు పూడ్చారు. 2022లో కౌలురైతు భరోసా యాత్ర పేరుతో మండపేటలో అన్నదాతల కుటుంబాలకు సొంతంగా చెక్‌లు పంపిణీ చేశారు. ఇలా ఒకటేంటి అనేక సమస్యలపై చలించి కదిలారు. ఇలా ప్రతి కష్టంలోను జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రజా సమస్యలపై ఉద్యమమై కదిలింది. అనేకసార్లు పవన్ మాట్లాడుతూ జనసేనకు అధికారం ముఖ్యం కాదని జనం సమస్యలు పరిష్కారమే కీలకమని ప్రకటించారు. ప్రజల కోసం ప్రభుత్వాలపై ఎంత వరకు అయినా పోరాడుతుందని చేసి చూపించారు. దీంతో గడచిన అయిదేళ్లలో గోదావరి జిల్లా ప్రజల గుండెల్లో మరింతగా నాటుకుపోయింది. దీని ఫలితంగా పంచాయతీ, జడ్పీ, మున్సిపల్ ఎన్నికల్లో చిన్నచిన్న విజయాలతో జిల్లాలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనసేనకు టీడీపీతో పొత్తు కుదరడంతో ఆ కలయిక గోదావరి జిల్లాలో ఓట్ల సునామీ సృష్టించింది. దీంతో అరాచక ప్రభుత్వాన్ని దించి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. అయితే అధికారం అండతో గత వైసీపీ ప్రభుత్వం గోదావరి జిల్లాను ధ్వంసం చేసి అరాచకంగా మార్చేసిందని ఎన్నికలప్పుడు పవన్ ధ్వజమెత్తారు. అందుకే గోదావరి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా చూసుకునే బాధ్యత తనది అని హెచ్చరించారు. పవన్ చేసిన శపథానికి గోదావరి ప్రజలు అండగా నిలబడి నిజం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఒక్కటంటే ఒక్క సీటూ వైసీపీకి రాకుండా గుండా సున్నా మిగిల్చారు.



అసంపూర్తి ఇళ్లకు అదనపు సాయం

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారంతో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పీఎంఏవై 1.0 అర్బన్, గ్రామీణ్ 1.0 పథకాల ద్వారా 429 లేఅవుట్లలో, సొంత స్థలాల్లో ఇళ్లు మంజూరుకాగా, వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి 11,345 మంది ఎస్సీలు, 549 మంది ఎస్టీలు, 15547 మంది బీసీలు కలిసి 27,441 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం కింద రూ. 138.57 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా ఎస్సీలకు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల మేర ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం వారు ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిదారులంతా మే నెలాఖరు నాటికి పూర్తిచేయాలని కోరారు. జూన్ 4వ తేదీ నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మన జిల్లాకు 10,794 ఇళ్లు పూర్తిచేసేందుకు లక్ష్యంకాగా, ఇప్పటివరకు 4,796 ఇళ్లు పూర్తిచేశామని కలెక్టర్ తెలిపారు.

పర్యాటక శాఖకు 116 ఎకరాలు, వ్యవసాయ కళాశాలకు 10 ఎకరాలు కేటాయింపు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంగ్రామ పరిధిలోని సర్వేనంబరు 386/6లో గల 10.72 ఎకరాల రెవెన్యూ స్థలాన్ని వ్యవసాయ కళాశాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 92ను జారీ చేసింది. మంగళగిరి కమిషనర్ అండ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ పరిధిలోని భూమిని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలకు ఉచితంగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు

జీవో జారీచేసిన ప్రభుత్వం

తదుపరి చర్యలు నిమిత్తం జీవోను జారీచేసి ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కాతేరు శివారు గామన్ బ్రిడ్జి రోడ్డులోని కళాశాల నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వం జీవో 90 పేరుతో మరో ఉత్తర్వుని కూడా విడుదల చేసింది. దీని ప్రకారం.. రాజమహేంద్రవరం గోదావరి బ్రిడ్జిలంకలోని 116.974 ఎకరాల లంక భూమిని పర్యాటక శాఖకు అభివృద్ధి నిమిత్తం కేటాయించింది.

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు గుండెపోటుతో మృతి


ఆన్‌లైన్‌లో పొలం పేరు మార్పు కోసం నిలదీత.. ఆ సమయంలోనే మరణం.. బంధువుల ఆందోళన

దేవరపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యానికి ఓ రైతు బలయ్యాడు. తమ పొలానికి సంబంధించి ఆన్‌లైన్‌లో తప్పు పేరు రావడంతో మార్పుకోసం తిరుగుతూ తహశీల్దార్ కార్యాలయం వద్దే గుండెపోటుకు గురై మరణించాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దెయ్యాల వెంకట్రావు (44) తన అత్త పాటిమ్మ వాటాకు రావాల్సిన 60 సెంట్ల భూమిని అత్త మేనల్లుడు అయిన పోలిమాటి రమేష్ పేరుపై ఆన్‌లైన్‌లోకి ఎక్కించడంతో 20 రోజులుగా ఆ పేరు మార్పు కోసం గ్రామ సర్వేయర్ దుర్గారావు చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం సాయంత్రం సర్వేయర్ దుర్గారావు మృతుడు వెంకట్రావుకు తహశీల్దార్ కార్యాలయానికి రావాలని తెలియజేయడంతో వెంకట్రావు తన భార్య రత్నకుమారిని తీసుకుని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. తన అత్త పాటిమ్మ పేరుమీద ఉన్న 60 సెంట్లు భూమిని తన అత్త పేరు మీద ఆన్‌లైన్ చేయాలని అధికారులను కోరాడు. ఈ క్రమంలో గ్రామ సర్వేయర్ దుర్గారావు, మండల సర్వేయర్ డిల్లేశ్వరరావులకు రైతుకి మధ్య వాగ్వాదం జరిగింది. వెంకట్రావు ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆటోలో మృతదేహాన్ని తహశీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. మృతుని భార్య రత్నకుమారి విలపిస్తూ తన భర్త మృతికి కారణం రెవెన్యూ అధికారులేనని ఆరోపించారు. మృతుని భార్య ఫిర్యాదుమేరకు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





మృతుడు వెంకట్రావు.. (ఫైల్‌ఫోటో)



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

జిల్లా కలెక్టరేట్ వద్ద వైసీపీ యువత పోరు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో యువత పోరు నిరసన కార్యక్రమం జరిగింది. నగరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సోదరుడు జక్కంపూడి గణేష్ దానవాయిపేట నుంచి ర్యాలీగా బయలుదేరగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మోరంపూడి నుంచి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. వీరు కలిసి కలెక్టరేట్ వరకు వెళ్లలేదు. రూరల్‌లోని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు కార్యాలయానికి చేరుకుని అక్కడ నుంచి కూడా ఎవరివర్గంతో వారే కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యానారాయణరెడ్డి, మాజీ హోంమంత్రి తానేటి వనిత, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ షర్మిళారెడ్డి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. 45 నిమిషాలపాటు నిరసన నిర్వహించారు. జేసీ చిన్నరాముడుకి వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం 9 నెలల్లో చేసిందేమిలేదని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని వారు ఆరోపించారు.



జిల్లా కలెక్టరేట్‌లో జేసీ చిన్నరాముడుకి వినతిపత్రం సమర్పిస్తున్న వైసీపీ నాయకులు

వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

6

హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు

ఢిల్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గత ఏడాది ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబడిన హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ -2024లో హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ కోసం ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్సీ కోసం పోర్టల్‌లో సమర్పించబడిన ఆన్‌లైన్ అప్లికేషన్‌కు సంబంధించి జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఢిల్లీలోని ఎలక్ట్రానిక్స్ నికేతన్‌లో స్క్రీనింగ్ కమిటీ ఎదుట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుత విద్యాసంవత్సరం 2024-25కుగాను ప్రధానమంత్రి ప్రకటించే అవార్డుల్లో ఇన్నోవేషన్ కేటగిరీలో జిల్లాస్థాయి నుంచి హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ ప్రాజెక్టు ఎంపిక కాగా, రాష్ట్రస్థాయిలో ఈ ప్రాజెక్టు తొలిసారిగా ఎంపికై జాతీయస్థాయికి చేరుకోవడం హర్షదాయకమని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఈ ఆలోచన సరైనదిగా ఉంటుందని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్టు కలెక్టర్ వెల్లడించారు.



ఉప్పాడలో ఎండలో ఆరబెట్టిన చేపలు

చెప్పతరమా...
ఉప్పు చేప

ఉప్పుచేప.. పప్పుచారు రుచి మనవాళ్లకు తెలిసినంతగా మరొకరికి తెలీదేమో. తరతరాల నుంచి ఈ కాంబినేషన్‌కు తిరుగేలేదు. పూర్వం సామాన్య కుటుంబాల్లో వండుకోవడానికి ఏమీ లేకపోతే పప్పుచారు కాచి, ఉప్పు చేప వేయిస్తే ఇంటిల్లిపాదీ ఆరోజు భోజనం కార్యక్రమం పూర్తయిపోయేది. అయినా ఉప్పుచేప రుచికి, పప్పుచారుకి లంగరు కుదరడం వల్ల ఇప్పటికీ ఈ రెండూ కలిపి తినాలనే నానుడి స్థిరపడింది. నిజానికి మాంసాహార ప్రియులంతా ఉప్పుచేప తినరు. కానీ ఇటీవల కాలంలో ఉప్పుచేపకు క్రేజీ అంతకంతకూ పెరుగుతోంది. హోటళ్లలో, వివాహ రిసెప్షన్లు, ఇతర ఫంక్షన్లలో ఉప్పుచేప కలిపి వండే వంటకాలను ప్రత్యేకంగా పెడుతున్నారు. ఉప్పుచేప వంటకాలు ప్రత్యేకమైన రుచిని కలిగి ఉండడంతో ఇవి తినేవాళ్లూ ఎక్కువగానే ఉంటున్నారు. ఈ కొత్త ట్రెండ్ ఎలా వున్నా ఉప్పుచేపలు అత్యధికంగా తయారుచేసే ప్రాంతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉప్పాడ కావడం గమనార్హం. సముద్రతీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఈ ఉప్పు చేపల ఉత్పత్తితో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు సైతం డ్రైఫిష్ ఉత్పత్తులు ఎగుమతి అవుతుండడం విశేషం.



రుచి చూశారా..
ఉప్పు చేప, పప్పు చారు
మాంసాహార వంటల్లో
ఇదో ప్రత్యేకం
హోటళ్లలో, వేడుకల్లో
ఇప్పుడొక స్పెషల్ డిష్
ఉప్పాడలో భారీ స్థాయిలో
ఉప్పు చేపల తయారీ
ఇతర రాష్ట్రాలు, విదేశాలకు
సైతం ఎగుమతి
ఉపాధి పొందుతున్న
మత్స్యకార మహిళలు



కొత్తపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామం మత్స్య సంపద ఉత్పత్తికి ప్రసిద్ధి. ఉప్పాడ తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకార మహిళలు ఐదు దశాబ్దాలకు పైగా ఎండు చేపలను తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఎండు చేపల రవాణాతో ఇక్కడ లక్షల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. సముద్రంలో వేటాడి ఒడ్డుకు తెచ్చిన చేపలను అమ్మగా మిగిలిన వాటిని ఉప్పు చేపలుగా తయారు చేస్తారు. వంజరం, కోనం, మాగ, సుదుములు, పండుగప్ప, సంధువా, గొరస, పసుపు పార, మొరాలు, కవళ్లు, నెత్తళ్లు... ఇలా పలు రకాల పచ్చి చేపలను మత్స్యకార మహిళలు రేవులో వేలంలో కొనుగోలు చేస్తారు. వాటిని రెండు పెడలుగా కోసి లోపల పేగులు, సెంకులు తదితర వ్యర్థాలు లేకుండా పూర్తిగా శుభ్రం చేస్తారు. వారం లేదా పదిహేను రోజుల పాటు ఉప్పు కుండీలో ఊరబెట్టిన చేపలను బయటకు తీసి సముద్రం ఒడ్డున ఎండబెడతారు. ఎండిన వంజరం, కోనం, పండుగప్ప చేపలను తట్టాలు అని పిలుస్తారు. ఉదాహరణకు బాగా ఎండిన వంజరం లేక కోనం తట్టాం ఒక్కో చేప రూ.600 నుంచి రూ.1,000 పలుకుతుంది. ఉప్పాడ జాంధానీ చీరల కొనుగోలుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే పలువురు ఇక్కడ తయారుచేసే ఎండు చేపల తట్టాలను ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తుంటారు. ఉప్పులో ఊరేసి ఎండిన చేపలను ముక్కలుగా చేసుకుని డబ్బాల్లో నిల్వ చేసుకుంటారు. ఇంట్లో ఎటువంటి కూర తయారు చేయని పరిస్థితుల్లో ఎండు చేప వేయించుకుని, పప్పుచారు కాసుకొని ఎండు చేప నంజుకు తింటే ఆ రుచే వేరంటారు చేప ప్రియులు. గతంలో సంవత్సరం పాటు ఎండు చేపలను తయారు చేస్తూ వేటకు వెళ్లే మత్స్యకారులకు మహిళలు చేదోడుగా సాయం అందించేవారు. గత ఏడాదిలో సంభవించిన వరుస తుఫాన్లు, అల్పపీడనాలతో మత్స్యకారుల జీవనోపాధికి ఆటంకం ఏర్పడింది.



తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకార మహిళలు చేపలు విరివిగా దొరికే ప్రాంతాలకు వెళ్లి పచ్చి చేపలను కొనుగోలు చేస్తారు. వాటిని ఎండు చేపలుగా తయారుచేసిన అనంతరం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఉప్పాడలో పూర్తి నాణ్యతతో తయారు చేసిన ఎండి చేపలకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలైన సుబ్బంపేట, కొత్తపేట, రంగూన్‌పేట, సూరాడపేట, రామిశెట్టిపేట, మాయాపట్నం, అమీనబాద్, మూలపేట, పొన్నాడ, కోనపాపపేట, తొండంగి మండలాల్లోని పలు తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకార మహిళలు ఎండు చేపలను తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వేట విరామంలో సుమారు 61 రోజుల పాటు ఎండు చేపల విక్రయం ద్వారానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. కేరళ, బెంగళూరు, కోల్‌కతా, చెన్నయ్ నగరాలకు లారీల ద్వారా ఉప్పాడ ఎండు చేపల ఎగుమతి జరుగుతోంది.

నెత్తళ్లు, మాగ చేపల్లో పోషక విలువలు

సముద్రంలో లభ్యమయ్యే నెత్తళ్లు, మాగ, వంజరం వంటి చేపల్లో మంచి పోషకాలు లభిస్తాయని పెద్దలు చెప్తున్నారు. పచ్చి, ఎండు నెత్తళ్లను బాలింతలకు పత్యంగా పెడతారు. మాగ, సుదుములు, కోనం తదితర పచ్చి చేపల్లో మెటాబాలిమ్ విలువలు మెండుగా ఉంటాయని వైద్యులు చెప్పడం గమనార్హం.

● ఉప్పాడ నుంచి విదేశాలకు ఎగుమతి

కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో అధికంగా తయారు చేసిన ఎండు చేపలను తాటాకు బుట్టల్లో ప్యాక్ చేసి ఇతర రాష్ట్రాలకు లారీల్లోను.... పండుగప్పలు, వంజరం లాంటి ఎండు చేపలను విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని కూడా ఆర్జిస్తున్నారు తీర ప్రాంత మత్స్యకారులు. ఉప్పాడ పరిసర, శివారు గ్రామాలకు చెందిన కేవలం నాలుగైదు కుటుంబాల మత్స్యకారులు నెలకు సుమారు 2 నుంచి 3టన్నుల ఎండు చేపలను తయారు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.

ప్లాట్‌ఫారాలు నిర్మించాలి

ఉప్పు చేపలను తొట్టిలోంచి తీసిన తర్వాత ప్లాట్‌ఫారాలపై ఎండిబెడితే మంచి నాణ్యత ఉంటుంది. సముద్రం ఒడ్డున ఇసుకలో బరకాలు వేసి ఆరబెట్టిన చేపలు అంతగా నాణ్యత ఉండదు. నాణ్యత కలిగిన ఎండు చేపలను తయారు చేసేందుకు, ప్రత్యేకంగా ఆరబెట్టేందుకు తీర ప్రాంత గ్రామాల్లో ప్లాట్‌ఫారాలు, ర్యాక్‌లు నిర్మించాలని మత్స్యకార మహిళలు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డ్రైఫిష్‌తో స్పెషల్ డిష్!

ఎండు చేపలు, రొయ్యల వంటకాలపై పెరిగిన మక్కువ
ప్రత్యేక వంటకాలతో ఘుమఘుమలు



రావులపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎండు చేపలు తినడం అందరికీ ఇష్టం ఉండదు. దీనికి వండేటప్పుడు వచ్చే వాసన కారణం కావొచ్చు. కానీ వండిన తర్వాత దీని రుచికి అలవాటు పడినవారు మాత్రం ఆహా అనకమానరు. ఇళ్లలో మాత్రమే ఎండుచేపలు, ఎండురొయ్యలతో ఏదైనా కలుపుతో వండుకునేవారు. ఇటీవలి కాలంలో సరికొత్త రుచుల వేటలో హోటళ్లలోను, వేడుకల్లోను ఎండు చేపలు, ఎండు రొయ్యలతో చేసిన వంటకాలను వేడివేడిగా వడ్డించేస్తున్నారు. ఎండు చేపలు ప్రత్యేక రుచిని కలిగి ఉండడంతో వీటిని తినేవాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది. సాధారణంగా చేపలు పేరు వినగానే ఘుమఘుమలాడే మసాలా వాసనతో వివిధ రకాల దినుసులతో తయారుచేసే చేపల పులుసు గుర్తుకొస్తుంది. కానీ ఇప్పుడు ఎండు చేపల వంటకాలపైనా మాంసాహారప్రియులు మక్కువ చూపడంతో వాటికి డిమాండు పెరిగింది. సీఫుడ్ వంటకాలపై ఆసక్తి ఉన్నవారంతా అందుబాటులో ఉండే ఈ డ్రైఫిష్‌లతో సరిపెట్టుకుంటున్నారు. దాంతో వాటి విక్రయ దుకాణాలు విరివిగా పెరుగుతున్నాయి. జాతీయ రహదారుల చెంతనే ఎండు చేపల దుకాణాలు వెలుస్తుండడంతో స్థానికులతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే వాహనచోదకులు ఆగి వాటిని కొనుగోలు చేస్తున్నారు. చిక్కుడు ఎండుచేప, మామిడికాయ ఎండుచేప, ఎండుచేప వంకాయ పులుసు, నెత్తళ్ల వంకాయ కోడి గుడ్డు, బీరకాయ నెత్తళ్లతోపాటు వివిధ రకాల కూరగాయల్లో ఎండుచేపలను విరివిగా వినియోగించి పసందైన కూరలు వండి వడ్డిస్తున్నారు. ఒకప్పుడు సముద్ర తీర ప్రాంత గ్రామ మార్కెట్లలో మాత్రమే లభ్యమయ్యే ఎండుచేపలు ప్రస్తుతం ప్రతి ప్రాంతంలోనూ అందుబాటులోకి రావడంతో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

పోషకాలూ ఉన్నాయ్..

ఎండు చేపలు తినడం వల్ల విటమిన్-డి, అయోడిన్, ఖనిజాలు, ప్రొటీన్లు, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం, తదితర పోషకాలు శరీరానికి పుష్కలంగా అందుతాయని మాంసాహార ప్రియులు చెప్తున్నారు. పచ్చి నెత్తళ్లు కానీ, ఎండు నెత్తళ్లను బాలింతలకు పత్యంగా పెడతారు. పండుగొప్ప, వంజరం, మాఘ, నెత్తళ్లు, కొయ్యింకలు, సందువా, కట్టిపరిగెలు, శాకరొయ్యి, రొయ్యిపొట్టు, పప్పురొయ్యలు, సావిడాయలు, కూన చేపలు, కానగంత, గొరసలు, కోనాం చేపలు, శంకు రొయ్యలు, జల్లితట్టువాలు, రామలు, ఇసుక దొందులు, చీరమేను, తెల్లరొయ్యలు, బల్లపరుగులు, చప్పిడి సావిడాయిలు, కొరివాప రిగెలతోపాటు పలు రకాల ఎండు చేపలు దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని దుకాణదారులు కాకినాడ, విశాఖపట్నం, పండి, పొర, నాగాయలంక, అంతర్వేది, బందరు, నర్సాపురం, ఉప్పాడ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చి విక్రయిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండల పరిధిలోని గౌతమి వంతెన వద్ద నుంచి వశిష వంతెన వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారి పొడవునా సుమారు 12కుపైగా దుకాణాలు ఉన్నాయంటే వీటికి డిమాండ్ ఎంత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

ఎండు చేపలకు డిమాండు

ఎండుచేపల కొనుగోలుదారులు పెరగడంతో వాటికి డిమాండ్ పెరిగింది. 30కుపైగా రకాలతో ఎండుచేపల దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. నిత్యం స్థానికులతో పాటు వాహనాల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఆగి వీటిని కొనుగోలు చేస్తున్నారు. మాంసాహారప్రియుల ఆహార అలవాట్లకు అనుగుణంగా ఇతర ప్రాంతాల నుంచి ఎండు చేపలను తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నాం.

కుసుమే రాంబాబు (ఏసు)
ఎండు చేపల వ్యాపారి, గోపాలపురం



రావులపాలెం మండలం గోపాలపురంలో హైవే పక్కన ఎండు చేపలు విక్రయిస్తున్న రాంబాబు

హనుమంత వాహనంపై నరసన్న విహారం

కోరుకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 3వ రోజు బుధవారం కోరుకొండ తీర్థం చూసేందుకు భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు కొండ పైన, దిగువన నరసింహస్వామిని దర్శించుకున్నారు. వారందరికీ దేవస్థానం అర్చకులు సర్వదర్శనం కల్పించారు.

నరసింహుడి సదస్యం

నరసన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆలయ ముఖ మండపంలో అన్నవరం దేవస్థానం వేద పండితులు, ఉభయ వేదాంత పండితులు సమక్షంలో అర్చకులు సదస్యం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదిక ఆశీనులను చేశారు. అనంతరం కొందరు పండితులు అమ్మవారి వంశ గొప్పతనాన్ని, మరి కొందరు నరసింహస్వామి వంశ గొప్పతనాన్ని వివరించారు. మంగళాశాసనం చేశారు. కార్యక్రమంలో ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రంగరాజ భట్టర్, పరాసర రఘునాథ భట్టర్, ఈవో వీర్ల సుబ్బారావు, ఉత్సవాల ముఖ్య అధికారి చంద్రశేఖర్, ఇతర అధికారులు వాసు, రాంజీ, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కటకం అన్నపూర్ణ, బది రెడ్డి దొర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

- ఉదయం కొండ పైన, దిగువున నరసన్న ఆరాధన, సర్వ దర్శనం, సేవాకాలం
- రాత్రి 7.30గంటలకు రంగనాథ స్వామి ఆలయంలో కల్యాణం, కళావేదికపై కూచిపూడి నృత్యం
- 8గంటలకు గజవాహనంపై నరసింహస్వామి గ్రామోత్సవం
- ధర్మసత్రంలో భక్తులకు ఉదయం, సాయంత్రం అన్నదానం
- రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం పండిత సభలు



హనుమంత వాహనంపై నరసింహస్వామి గ్రామోత్సవ దృశ్యం

వైభవంగా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం

నరసన్న కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 9గంటలకు ఆంజనేయ వాహనంపై నరసింహస్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి సదస్యం అనంతరం అర్చకులు స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులను చేసి వేదమంత్రాలతో తోడ్కొని వచ్చి ఆంజనేయ వాహనంపై ఉంచారు. అనంతరం ప్రత్యేక పూజలు, మంగళహారతులు, నివేదనలు అందించారు. తదుపరి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అలాగే స్వామివారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. శ్రీ రంగరాజస్వామి ఆలయ ప్రాంగణంలో విశిష్ట అద్వైత పండిత సభలు జరిగాయి.



నరసింహుడికి సదస్యం నిర్వహిస్తున్న పండితులు

భద్రతపై అలసత్వాన్ని సహించం: రైల్వే జీఎం

- రాజమహేంద్రవరం, సామర్లకోట, కాకినాడ స్టేషన్లను తనిఖీ చేసిన ఉన్నతాధికారి
- అమృత్ భారత్ పథకంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఆరా
- అధికారులు, సిబ్బందికి సూచనలు



ట్రాలీపై వెళ్తూ రోడ్‌కంరైలు బ్రిడ్జిని పరిశీలిస్తున్న జీఎం

రాజమహేంద్రవరం/సామర్లకోట/కాకినాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): భద్రతా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చిన్న అలసత్వానికి కూడా వీల్లేదని, ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ స్థానిక అధికారులకు స్పష్టం చేశారు. విజయవాడ డివిజన్‌లో భద్రతా తనిఖీల్లో భాగంగా ఆయన, ఉన్నతాధికారుల బృందంతో కలిసి రాజమండ్రి, సామర్లకోట, కాకినాడ రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. బుధవారం ప్రత్యేక రైలులో రాజమండ్రి రైల్వేస్టేషన్‌కి చేరుకుని అమృత్ భారత్ పథకంలో రూ.273 కోట్లతో చేపట్టనున్న రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తూర్పు రైల్వేస్టేషను ప్రాంగణం, ప్రస్తుతం ఉన్న భవనాలను పరిశీలించారు. ప్లాన్ ప్రకారం అక్కడ నిర్మించే భవనాలు, రోడ్డు వెడల్పు, ప్రయాణి కుల సదుపాయాలు, ట్రాక్ తదితర మార్పులపై విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ జీఎంకు వివరించారు. తర్వాత పశ్చిమ వైపు ప్రాంగణానికి చేరుకొని అక్కడ ఏమేమి మార్పు రాబోతున్నాయో తెలుసుకున్నారు. ప్రయాణికుల సదుపాయాలు, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని చూశారు. క్రూలాబీ చేరుకొని భద్రతా పరమైన అంశాలపై అక్కడి సిబ్బందికి కౌన్సెలింగ్ చేశారు. రైల్వే స్టేషను అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రాధాన్యాలపై పలువురు ప్రజా ప్రతినిధులు ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. ఆపై ప్రత్యేక రైలులో వెళ్లి రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద ఆగారు. అక్కడి నుంచి సుమారు 3 కిలోమీటర్ల మేర ట్రాలీపై వెళుతూ బ్రిడ్జిని, ట్రాక్ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు.

అలాగే రైల్వే జీఎం సామర్లకోట చేరుకుని రైల్వేస్టేషన్లో రూ.25.37 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వివిధ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాం 1,2,3లలో జరుగుతున్న పనులను పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా సిగ్నలింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధ హోదాల అధికారులను, సిబ్బందిని జీఎం ప్రశ్నించారు. అంతకు ముందు సామర్లకోట చేరుకున్న జీఎంకు స్థానిక రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు.

అలాగే జీఎం అరుణ్‌కుమార్ జైన్ కాకినాడలోని టౌన్, పోర్టు రైల్వే స్టేషన్లకు చేరుకుని రెస్ట్ రూమ్‌లు, రన్నింగ్ రూమ్‌లు ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో జరుగుతోన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే ట్రాక్‌లైన్ పనులు పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోర్టు స్టేషన్లో రన్నింగ్ రూమ్ ఎదుట మొక్క నాటారు.



కాకినాడ టౌన్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే జీఎం

ప్రేమను పంచండి... ద్వేషించవద్దు

తాటిపర్తిలో సందేశాత్మకంగా నాటక పోటీలు



భౌ..భౌ..భౌ నాటకంలో ఓ సన్నివేశ దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కని పెంచిన పిల్లలు ప్రేమలో పడగానే ద్వేషించవద్దు. శత్రువులుగా చూసి వారిపై తీసుకునే చర్యలు జీవితంలో మాయలేని మచ్చగా మిగిలిపోతాయి. అదే సమయంలో కని పెంచిన తల్లిదండ్రులను విస్మరించి ప్రేమలో పడి వారికి తెలియకుండా వివాహం చేసుకోవడం సరైన పద్ధతి కాదంటూ సందేశాన్ని ఇస్తూ భౌ..భౌ..భౌ నాటకం సాగింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళా తోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకాల పోటీల్లో నాలుగో రోజున రాజమహేంద్రవరం కందుకూరి వీరేశలింగం కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకం అందరినీ ఆలోచింపజేసింది. కుమార్తె తక్కువ కులం వాడిని ప్రేమించిందని ఆమెను చంపిన తల్లిదండ్రుల తీరుని తప్పుపడుతూ మనుషుల కంటే కుక్క తదితర జంతువులే ఎక్కువ ప్రేమాభిమానాలు కలిగి ఉంటాయని వివరించారు.

వైసీపీ విమర్శలను ధీటుగా ఎదుర్కొంటా: సోము



సోము వీర్రాజుకు గజమాల వేస్తున్న పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ప్రభుత్వంపై అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, వారి విమర్శలను శాసనమండలిలో కూటమి సభ్యుడిగా ధీటుగా ఎదుర్కొంటామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నామినేషన్ వేసి బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఆయన కార్యాలయం వద్ద ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా సోము మీడియాతో మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ఇప్పటికే ఎంపీ పురంధేశ్వరి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారని, సాంస్కృతికశాఖ మంత్రి దృష్టికి అన్ని విషయాలను తీసుకెళ్లారన్నారు. గోదావరి జలాల ప్రక్షాళన కూడా మొదలవుతుందని, వచ్చే ఐదేళ్లలో దీనిపై ఖర్చు చేసేందుకు కేంద్రం రూ.400 కోట్లు కేటాయించిందని సోము పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ, హారిక, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పాదగయలో ఎమ్మెల్యేల పూజలు



పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

పిఠాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని పలువురు ఎమ్మెల్యేలు బుధవారం సాయంత్రం సందర్శించారు. ప్రభుత్వ విప్‌లైన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీని వాస్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, హోటల్స్ 'ఎన్' గ్రూపు అధినేత నారా శేషు పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వారికి వేద పండితులు క్షేత్రప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలను ఈవో కేజే శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు.



మంచు కురిసే వేళలో..



యానాంలో పంట పొలాలపై పొగ మంచు





మండపేట, అనపర్తిలో మంచు దృశ్యాలు

అమ్మమ్మను ఇంటి వద్ద దింపి వస్తుండగా...

అన్నదమ్ముల మృతి



సాంబశివ (ఫైల్‌ఫొటో)



వీరేంద్ర (ఫైల్‌ఫొటో)

గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణం

ఐ.పోలవరం మండలం బాలయోగి బ్రిడ్జిపై ఘటన

ఐ.పోలవరం/ముమ్మిడివరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చిన అమ్మమ్మను తిరిగి వాళ్లింటి దగ్గర దింపేందుకు మోటారుసైకిల్‌పై వెళ్లిన అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం బాలయోగి బ్రిడ్జిపై మంగళవారం రాత్రి ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ఐ.పోలవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లరేవు మండలం సుంకరపాలెనికి చెందిన ఎల్లా వీరేంద్ర(17), ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామానికి చెందిన వేమవరపు సాంబశివ (14) వరుసకు అన్నదమ్ములు అవుతారు. వీరేంద్ర కొత్తలంకలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. వారిద్దరు వీరేంద్ర అమ్మమ్మను సుంకరపాలెంలో దింపి బైక్‌పై తిరిగి వస్తుండగా యానాం బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఇద్దరికి తలపై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బుధవారం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఐ.పోలవరం ఎస్‌ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వేమవరపు ఏసురాజు-గంగాభవానీ దంపతుల చిన్న కుమారుడు సాంబశివ 9వ తరగతి చదువుతున్నాడు. మోటారుసైకిల్‌పై సాంబశివ, వీరేంద్ర అమ్మమ్మను దింపి తిరిగి వస్తుండగా మృత్యువాతకు గురవ్వడంతో తల్లిదండ్రులు రోధిస్తున్నారు.

సుంకరపాలెంలో విషాదచాయలు

తాళ్లరేవు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం బాలయోగి బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదంలో కాకినాడ జిల్లా సుంకరపాలెం యువకుడు ఎల్లా వీరేంద్ర మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలము కున్నాయి. వీరేంద్ర మినీ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా తండ్రి సూరిబాబు తాపీమేస్త్రి, తల్లి రాముడు గృహిని, చెల్లి సిరి 9వ తరగతి చదువుతుంది.

హింసాత్మక దాడికి పాల్పడిన నలుగురి అరెస్ట్



కాకినాడ రూరల్: పోలీసులతో నిందితులు

కాకినాడ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హింసాత్మక దాడికి పాల్పడిన నలుగురు నిందితులను సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ గొడారిగుంటలోని వినాయక వైన్‌షాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు మద్యం తాగేందుకు వచ్చి చిన్న విషయంపై గొడవపడిన సంఘటన హింసాత్మకంగా మారింది. అయితే ఉద్దేశ్యపూర్వకంగానే నిందితులు బీర్‌బాటిళ్లతో దాడి చేసి తీవ్రమైన గాయాలు చేశారన్నారు. దీంతో అదే ప్రాంతానికి చెందిన నిందితులు సీకోటి రాజు, పెయ్యల ప్రసాద్, సీకోటి ప్రసాద్, కలాడి అర్జునరావులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. కేసుపై విచారణ కొనసాగుతోందని, చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని వారిని కస్టడీకి తరలించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేలుడు పదార్థాలతో దాడికి పాల్పడిన ముగ్గురి అరెస్టు

ద్రాక్షారామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామలో పేలుడు పదార్థాలతో దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు మైనర్లతో సహా మరో వ్యక్తిని బుధవారం ద్రాక్షారామ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెలంపాలెం రైల్వే క్రాసింగ్‌గేటు వద్ద పోతురాజు వినీల్‌కుమార్ మరో ఇద్దరు మైనర్లను ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ అరెస్టు చేశారు. మైనర్లను రాజమహేంద్రవరం జువైనల్ కోర్టుకు తరలించారు. వినీల్‌కుమార్‌ను రామచంద్రపురం కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

కాకినాడలో పేలుడు ఘటనలో

తీవ్ర గాయాలైన వ్యక్తి మృతి



మద్దిలేటి (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 3న జరిగిన పేలుడు ఘటనలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ డైరీఫారం సెంటర్‌కు చెందిన గజ్జిల మద్దిలేటి (38) వార్ఫ్ రోడ్డు సమీపంలోని కమర్షియల్ రోడ్డులో ఉన్న జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్‌లో జట్టు కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న విధుల్లో భాగంగా హైదరాబాద్ నుంచి వచ్చిన లారీలోని పార్శిల్ దింపుతున్నారు. అందులో ఒకటి ఉల్లిపాయ (గోడ) బాంబుల పార్శిల్ కావడంతో ఒక్కసారిగా పెద్ద శబ్ధంతో విస్ఫోటనం జరిగి మద్దిలేటితో పాటు మరో నలుగురు హమాలీలు గాయాలపాలయ్యారు. పార్శిల్ దింపుతున్న మద్దిలేటికి శరీరం 50 శాతం కాలిపోయింది. కాకినాడ జీజీహెచ్‌లోని బర్న్స్ వార్డులో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో

మండపేట యువకుడి మృతి

మండపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణం కొండపల్లి వారి వీధికి చెందిన పి.జితేంద్ర (33) మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కటుంబసభ్యులు వివరాల ప్రకారం... జితేంద్ర బతుకుతెరువు కోసం మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఈనెల7న ఫైనాన్స్ పని మీద ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఉద్గావ్‌లో హల్నీ రహదారిపై గుడ్స్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జితేంద్ర మృతితో మండపేటలో విషాదచాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని అక్కడ నుంచి అంబులెన్స్‌లో తీసుకొచ్చి మండపేటలో అంత్యక్రియలు చేశారు.

రావులపాలెంలో కంటిపూడి షోరూమ్ ప్రారంభం

రావులపాలెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెంలో కంటిపూడి అధికృత డీలర్ నూతన శాటిలైట్ డీలర్‌షిప్‌ను బుధవారం ప్రారంభించారు. సంస్థ రీజనల్ మేనేజర్ శివరామకృష్ణ కంటిపూడి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కటంమనేని వినయ్‌బాబు ప్రారంభించి మాట్లాడుతూ వినియోగదారులు మెరుగైన సేవలందించేందుకు అత్యాధునిక ఆటోమెటిక్ పరికరాలు కలిగిన వర్క్‌షాపును రూపొందించామన్నారు. కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వరాయుడు, ఎం.జగన్, సీహెచ్.సత్యనారాయణమూర్తి, కె.మన్మోహన రావు, సేల్స్ ఆర్‌ఎం శివరామకృష్ణ, జీఎం రాజారావు, బ్రాంచ్ మేనేజర్ వంశీ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన ఎం.రామాంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందించారు. దాతను అభినందించి, వారికి స్వామివారి ప్రత్యేకదర్శనం కల్పించి ప్రసాదం అందించారు. సత్యదేవుడి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా బుధవారం మూలవరులకు జన్మనక్షత్ర పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతి గావించారు.



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

రేపు జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా..

216 హైవేపై ట్రాఫిక్ మళ్లింపు




పిఠాపురం మండలం చిత్రాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు మనోహర్, దుర్గేష్


పిఠాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారులో ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభను దృష్టిలో ఉంచు కుని శుక్రవారం కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. ఆ రోజు ఉదయం 11 నుంచి రాత్రి 11గంటల వరకూ కార్యక్రమాలు జరగనుండటం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తదితరులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా ఆ రోజు ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం తెలిపారు. సభ వద్ద ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలను జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, మంత్రులతో కలిసి పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని తెలిపారు.

సభకు వచ్చేవారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

మంత్రులు మనోహర్, దుర్గేష్

జనసేన ఆవిర్భావ సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో 14న జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌లతో కలిసి వారు బుధవారం రాత్రి పరిశీలించారు. హెలిప్యాడ్, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లుపై ఆరా తీశారు. సభకు వచ్చేవారు నేరుగా సభా ప్రాంగణంలోని వచ్చేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వారి వెంట కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, జనసేన నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.





వాహనాల మళ్లింపు మార్గాల మ్యాప్‌లు

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...

కాకినాడ, కోనసీమ జిల్లాలు నుంచి విశాఖపట్టణం(వయా కత్తిపూడి) వెళ్లే వాహనాలు కాకినాడ-ఇంద్రపాలెం వంతెన, కెనాల్ రోడ్డు, సామర్లకోట, కిర్లంపూడి, ప్రత్తిపాడు మీదుగా ఎన్‌హెచ్-16కి మళ్లిస్తారు

విశాఖపట్టణం నుంచి కాకినాడ, కోనసీమ జిల్లాలుకు వచ్చే వాహనాలు కత్తిపూడి నుంచి ప్రత్తిపాడు, కిర్లంపూడి, సామర్లకోట, కాకినాడ(కెనాల్‌రోడ్డు)మీదుగా మళ్లిస్తారు.

విశాఖపట్టణం-చెన్నై మధ్య కాకినాడ జిల్లా మీదుగా ఎన్‌హెచ్-16పై ప్రయాణించే వాహనాలు యధావిధిగా వెళ్లవచ్చు

వాహనాల పార్కింగ్‌కు 9 ప్రదేశాలు

వివిధ ప్రాంతాల నుంచి సభకు తరలివచ్చేవారి వాహనాల పార్కింగ్ కోసం చిత్రాడ పరిసర ప్రాంతాల్లో 9ప్రాంతాలను గుర్తించారు. కాకినాడ వైపు అయిదు, పిఠాపురం వైపు నాలుగు పార్కింగ్ ప్లేసులు ఏర్పాటు చేశారు.

పార్కింగ్ స్థలాలకు ఇలా వెళ్లాలి

పార్కింగ్ ప్రదేశాలు 1(ఏ,బీ,సీ,డీ,ఈ)లకు గుంటూరు జిల్లా, తెనాలి, కృష్ణా, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ తదితర జిల్లాల నుంచి వచ్చే వాహనాలు ఉప్పలంక బైపాస్, చీడిగ, ఇంద్రపాలెం, కెనాల్‌రోడ్డు, సామర్లకోట, 3 లైట్ల జంక్షన్, ముత్తా గోపాలకృష్ణ ఆర్వోబీ, సర్పవరం, అచ్చంపేట జంక్షన్ మీదుగా చిత్రాడ సభాస్థలానికి చేరుకోవాలి.

పార్కింగ్ ప్రదేశాలు 2(ఏబీసీడీ)లకు ఉత్తర కోస్తా జిల్లాలు విశాఖ, అనకాపల్లి, ఏఎస్ఆర్ తదితర జిల్లాల నుంచి కత్తిపూడి, పిఠాపురం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలి.

తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల నుంచి వాహనాలు ఏడీబీ రోడ్డు, రాజానగరం, రంగంపేట, సామర్లకోట, పిఠాపురం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలి.

ఏలూరులో లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 12 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావాసులు



లారీని ఢీకొన్న బస్సు

ఏలూరు క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగి 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ నుంచి గుంటూరుకు మంగళవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బుధవారం తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో ఏలూరు మెయిన్ బైపాస్ రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఆయిల్ డబ్బాల లారీని వెనుక నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ముగ్గురికి పళ్లు ఊడిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ఇట్టి సత్యసాయి (కాకినాడ), కర్రి హారిక (రావుల పాలెం), వెల్ల రాజు (మాచవరం), కడియం రామశివుడు (కాకినాడ), కొర్ల సుబ్రహ్మణ్యం (కాకినాడ), కొత్తల వెంకట లక్ష్మి(రామచంద్రపురం), కఠారి శిరీష్ (కాకినాడ), ఆరేపల్లి సాయిదుర్గ ప్రసాద్ (తణుకు), వడిత దత్తు నాయక్ (మాచర్ల), జగిలింగ పవన్‌కుమార్ (కాకినాడ), ఆకుల శేషు (కడియపులంక), రూపేంద్ర గాంధీలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్‌ఐ రాంబాబు పరామర్శించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీలోని 2 ఆయిల్ డబ్బాలు పగిలిపోవడంతో ఆ ప్రాంతమంతా ఆయిల్ పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. క్రేన్లతో లారీ, బస్సును రోడ్డు పక్కకు తీయించి వాహనాల రాకపో కలకు అంతరాయంలేకుండా చర్యలు తీసుకున్నారు.

బాధితులకు సాయం అందించే ప్రయత్నం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం రాత్రి 12.55కి గుంటూరు బయలుదేరిన సూపర్‌లగ్జరీ బస్ ఏలూరు సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ బస్సులో మొత్తం 26మంది ప్రయాణిస్తున్నారు. వారిలో 12మందికి తీవ్ర గాయాలు కాగా ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి ఆర్టీసీ అధికారులు చికిత్స నిమిత్తం రూ.5వేలు ఇవ్వడానికి ప్రయత్నించినా కొంతమంది తిరస్కరించి అవసరంలేదని చెప్పి వెళ్లిపోయినట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు.

గొల్లపాలెంలో సల్ఫర్ గ్యాస్ లీక్

తొమ్మిది మందికి అస్వస్థత






ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మలికిపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెం పంచాయతీ కేశనపల్లి జీజీఎస్‌లో గ్యాస్ లీక్‌తో ప్రజలు ఆందోళన చెందారు. ప్రతీ రెండు సంవత్సరాలకొకసారి పైపులైన్లను శుభ్రపరిచే ప్రక్రియలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నైట్రోజన్ యాసిడ్, అమ్మోనియా, సల్ఫర్ వాయువులతో శుద్ధి చేస్తుండగా పైపులైన్ పిన్ వాల్వ్ లీకవడంతో గ్యాస్ లీకేజీ ప్రభావం పరిసరాలపై పడింది. కొంత మందికి శ్వాస ఆడకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రక్రియలో ఎ.పవన్, ఫణీంద్ర, శ్రీనివాస్, ప్రదీప్, రమేష్‌కుమార్ అస్వస్థతకు గురి కాగా పవన్‌ను మెరుగైన చికిత్స కోసం భీమవరం తరలించారు. సల్ఫర్ వాయువు బయటకు వ్యాపించడంతో సరీన్, తిరుమల వెంకటలక్ష్మి అనే ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. వారికి స్థానిక వైద్య సిబ్బంది వైద్యసేవలు అందించారు. సంఘటనా స్థలానికి ఆర్డీవో కె.మాధవి హుటాహుటిన వచ్చారు. ఓఎన్జీసీ అధికారులతో ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పిన్‌వాల్వ్‌ను లీకేజీని 15 నిమిషాల్లో అదుపు చేసినప్పటికీ ఆ ప్రభావం 2 గంటలసేపు ఉంటుందని అధికారులు తెలిపారు. బాధితులను ఆర్డీవో పరామర్శించారు. వారి వెంట రాజోలు సీఐ నరేష్‌కుమార్, తహశీల్దార్ శ్రీనివాస్‌లు ఉన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అప్పులు తీర్చలేక గడ్డి మందు తాగి

కౌలు రైతు ఆత్మహత్య



వెంకటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

తాళ్లరేవు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన కౌలు రైతు పెచ్చేటి వెంకటేశ్వరరావు(45) అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెంకటేశ్వరరావు తన సొంతభూమితో పాటుగా మరికొంత కౌలు పొలం సాగుచేస్తూ పంట నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీరక కొంతకాలం వ్యవసాయం వది లేసి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు పనికివెళ్లాడు. ప్రస్తుతం కాకినాడలో కూలిపని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం యానాం బీచ్‌కు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వరరావును యానాం పోలీసుల సాయంతో కాకినాడలో ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతదేహానికి యానాంలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తెలు శ్రీదేవి, జ్యోతిశ్రీలు ఉన్నారు. ఈ సంఘటనతో పత్తిగొందిలో విషాదచాయలు అలముకున్నాయి.

ఉమ్మడి జిల్లా పరిషత్ రూ.886 కోట్ల

బడ్జెట్‌కు ప్రభుత్వ ఆమోదం

పంచాయతీరాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు

రంపచోడవరం/కాకినాడ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లా పరిషత్‌లకు సంబంధించి ఆయా జిల్లా పరిషత్‌ల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 2024-25 బడ్జెట్ అంచనాలను రూ.886 కోట్ల మేరకు ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ వివరాలిలా ఉన్నాయి. 2022-23లో వాస్తవ రాబడి రూ.44.37 లక్షలు ఉండగా, వాస్తవ వ్యయం రూ.54.47 లక్షలుగా ఉంది. 20 23-24 సవరించిన అంచనాలైతే రాబడిగా రూ.883 కోట్లు కాగా, వ్యయాన్ని రూ.882 కోట్లుగా చూపారు. ఇక 2024-25 బడ్జెట్ అంచనాలకు సంబంధించి రాబడిని రూ.886 కోట్లుగా చూపితే, వ్యయాన్ని కూడా రూ.886 కోట్లుగా చూపి అంచనా ప్రతిపాదనలను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ప్రభుత్వానికి పంపించగా పలు షరతులతో ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. జరిపిన వ్యయాలకు సంబంధించి కచ్చితమైన లెక్కలను ఆధారాలతో చూపాలని, బడ్జెట్‌లో ఎస్సీలకు, ఎస్టీలకు ఆయా జనాభా ప్రాతిపదికన కేటాయించాల్సిన నిధుల వ్యయానికి సంబంధించి స్పష్టమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. అంతే కాకుండా జిల్లా పరిషత్ స్థాయిలో ఐదేళ్ల వార్షిక ప్రణాళికలను జిల్లా ప్రణాళికా చట్టం ప్రకారం సిద్ధం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

15న పి.గన్నవరంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు



పోటీల ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 15న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో యునైటెట్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్‌ప్రెస్- 2025 పోటీలు జరగనున్నాయి. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అండ్ ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల ట్రోఫీలను పోతవరంలో బుధవారం స్థానిక ఎస్‌ఐ బి.శివ కృష్ణ ఆవిష్కరించారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంకిపాటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ పోటీలకు అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. 3విభాగాల్లో మొత్తం 10 కేటగిరీల్లో మెన్ 53, 59, 66, 74, 83, 93 కేజీల మాస్టర్స్ విభాగం, మహిళలకు 63 లోపు, ఆపైన కేజీల్లో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్, నేషనల్‌షీల్డ్‌లను అందిస్తామన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్ కత్తుల శ్రీనివాసు, నల్లా పెద్దకాపు, చికిలే తరుణ్, తోలేటి వంశీకృష్ణ, బొరుసు రాజబాబు, నందుల సన్నీ,తోలేటి రాజా పాల్గొన్నారు.

10 కాసుల బంగారం, రూ.5 లక్షలు చోరీ

ఉండ్రాజవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో 10 కాసులు బంగారం, రూ.5లక్షలు నగదు దోచుకెళ్లారు. ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలు ఇల్లా ఉన్నాయి. ఉండ్రాజవరంలోని నిమ్మతోటలో ఉంటున్న సీసాని చిరంజీవి, అతడి భార్య సీసాని విజయలక్ష్మి మంగళవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లారు. ఈ నెల 29న వారి కుమారుడు నరేష్ పెళ్లి సందర్భంగా రూ.5లక్షలు నగదు బీరువాలో దాచారు. అదేవిధంగా 10 కాసుల బంగారం బీరువాలో ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక గేటు నుంచి వచ్చి తలుపులు పగుల గొట్టి బెడ్‌రూమ్‌లోని బీరువా పగుల గొట్టి రూ.5లక్షలు నగదు, 10కాసులు బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. విజయలక్ష్మి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తీసి ఉండటం, బెడ్ రూమ్ బీరువాలో తెరిచి ఉండటంతో పోలీసులకు విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని సీఐ తిలక్, ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు పరిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చోరీకి గురైన 53 సెల్‌ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లతో డీఎస్పీ రఘువీర్, సీఐలు, ఎస్‌ఐలు

ద్రాక్షారామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం సబ్‌డివిజన్ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్లు రికవరీకి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి రూ.5 లక్షలు విలువైన 53 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ బి.రఘువీర్ తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లు పరిధిలో ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేశామన్నారు. 53 సెల్‌ఫోన్లను యజమానులకు డీఎస్పీ అందజేశారు. సీఐలు ఎం.వెంకట నారాయణ, దొరరాజు, సురేష్, ఎస్‌ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

మైనర్‌ను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు

రాజవొమ్మంగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగికి చెందిన చిత్తారపు రాంబాబు అనే వ్యక్తి ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక మైనర్‌కు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీనిపై ఈనెల 11న మైనర్ తల్లి ఇచ్చిన మేరకు రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజవొమ్మంగి సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. ఎస్‌ఐ నరసింహమూర్తి,పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి: ఏవో


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో ఇమామి ఖాసిం

దివాన్‌చెరువు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైతులు ఈ-పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ ఇమామి ఖాసిం చెప్పారు. మండలంలోని పాలచర్లలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు ద్వారా రైతులు అన్నదాత సుఖీభవతోబాటు వ్యవసాయ పరికరాలును రాయితీపై పొందవచ్చన్నారు. ఉద్యానశాఖాధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ అయిల్ పామ్ మొక్కలు 100 శాతం రాయితీపై ఇస్తున్నారన్నారు. బిందు తుంపర సేద్య పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోందని చెప్పారు. రైతు సేవకేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు నజీనా, నాయకులు గంగిశెట్టి చంటిబాబు, టి.బిందుశేఖర్, పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలపై శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

బిక్కవోలు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు బుధవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీ4 సర్వేను వేగవంతం చేయాలని, ఇళ్ల నుంచి చెత్తను తీసుకునే కుటుంబాలకు ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయని అందువల్ల సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా వుండాలన్నారు. అలాగే పింఛన్ల పంపిణీపై పింఛనుదారులు ఐవీఆర్ కాల్స్‌లో సమస్యలు చెబుతున్నారని అందువల్ల సచివాలయ సిబ్బంది లబ్ధిదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జాన్ మిల్టన్, మాస్టర్ ట్రైనర్ మండల ఎంవోటీ సూరిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు సోదర భావంతో మెలగాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి


హాస్టల్లోని విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ తోటి వాళ్లతో స్నేహ పూర్వకంగా, సోదర భావంతో మెలగాలని.. ఆకతాయి పనులు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి విద్యార్థులకు సూచించారు. బుధవారం బీసీ బాలికల సమీకృత సంక్షేమ వసతిగృహంలో 'నల్సా వారి.. బాల బాలికలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి సంరక్షణ పథకం-2024', మంచి, చెడు స్పర్శలు, పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. బాలబాలికలు తమ పట్ల జరిగే అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే పోలీసులకు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనంతరం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణా గృహాన్ని సందర్శించారు. మోసపూరిత వ్యక్తుల ప్రలోభాల వలలో పడకుండా తెలివిగా వ్యవహరించాలని వారికి సూచించారు. ఆలోచనా రహితంగా చేసే పనుల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

సీతారామ భక్త మందిరంలో విగ్రహాల పునః ప్రతిష్ఠ

అనపర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శివాలయం వద్ద సీతారామ భక్త మందిరంలో బుధవారం స్వామి అమ్మవార్ల విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. 1935లో వల్లూరి ఎల్వీ రామచంద్రరావు, చాత్రాతి రామచంద్రరావు కుటుంబాల వారు నిర్మించిన రామాలయాన్ని ఇటీవల పునర్నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం వేద పండితులు మంత్రోత్సరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఈస్ట్రన్ గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

పారదర్శకంగా పనిచేయాలి: నన్నయ వీసీ


యూనివర్శిటీలో పరీక్షా విభాగాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) :పరీక్ష విభాగం నుంచి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పనిచేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. వర్శిటీలోని యూజీ, పీజీ పరీక్షా విభాగాలను బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. పరీక్షా విభాగ అధికార్లు, సిబ్బంది సమష్టిగా పనిచేస్తే సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించవచ్చునన్నారు. యూనివర్శిటీలో నీటి ఎద్దడిపై గ్రామీణ నీటిసరఫరా అధికారులతో మాట్లాడానని, నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం పనిచేస్తున్న రెండు బోర్లు సరిపోవడంలేదని మరో మూడు బోర్లు వేయాలని సంబంధిత అధికారులకు తెలిపానన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు నీటిసమస్య తలెత్తకుండా ముందస్తుచర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దీనికి అధికార్లు సహకరించాలని కోరామని చెప్పారు. కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి అనేక అవకాశాలు: జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి అనేక అవకాశాలు ఉన్నాయని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య సమీకరణ, జ్ఞాన అవగాహనతో జీవనోపాధుల పెంపుదల లక్ష్యంగా సంకల్ప్ పేరుతో ఇండస్ట్రీ మీట్ జేఎన్ రోడ్‌లోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేసీ మాట్లాడుతూ స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం జిల్లా యంత్రాంగం, పరిశ్రమల మధ్య సమన్వయం సాధించడం ముఖ్యమన్నారు. ఈ మీట్‌లో పరిశ్రమల ప్రతినిధులు రాజ్‌కుమార్, సుబ్బారావు, యర్రా రాము, వేదవ్యాస్, జిల్లా నైపుణ్యాధికారి వి.మురళీ ఆయా పరిశ్రమలకు కావలసిన నైపుణ్యాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

సోము వీర్రాజుకు
ఎమ్మెల్సీ పదవి పట్ల హర్షం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజుకు రెండో పర్యాయం ఎమ్మెల్సీ పదవి లభించడం పట్ల బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి వీరా వీరాంజనేయులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం సోము వీర్రాజును కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోటాలో సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ సీటు కేటాయించడం హర్షణీయమన్నారు.

సంగీతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి12 (ఆంధ్ర జ్యోతి): స్థానిక టి.నగర్ శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ఆధ్వర్యంలో సంగీత వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ముప్పవరపు వెంకట సింహాచలం శాస్త్రి హరికధా గాన కచేరి నిర్వహించారు.

నేడు మోతా వెంకట్రావు
వర్ధంతి సభ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఉదయం 10గంటలకు కార్మిక పోరాట యోధుడు ఉభయ తెలుగు రాష్ట్రాల ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు కామ్రేడ్ మోతా వెంకట్రావు 6వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నామని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్యవక్తలుగా ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఏఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజీబాబు, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, కొండా దుర్గారావు, పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ సంగీత, పిడిఎస్‌యు విజృంభణ రాష్ట్ర కన్వీనర్ సతీష్ హాజరవుతారని తెలిపారు.

పిరమిడ్ ధ్యాన మందిర వార్షికోత్సవం

బిక్కవోలు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొంకుదురులోని శ్రీశివరామకృష్ణ పరమిడ్ ధ్యాన మందిర వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ వంశీకిరణ్ ధ్యాన ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గొలుగూరి భాస్కరెడ్డి సుశీల దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పిరమిడ్ ధ్యానులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మంచు దుప్పటి

రోజులానే బుధవారం ఉదయం ఆరు గంటలకే తెల్లారింది. వాతావరణం కూడా సమానంగానే ఉంది. 7గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు వచ్చాయి. దట్టమైన పొగమంచుతో రోడ్లన్నీ నిండిపోయాయి. సుమారు గంటకు పైగా తెరిపివ్వకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పాఠశాలలకు చెందిన బస్సుల్లో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. స్కూల్ వెళ్లిన తమ పిల్లల పరిస్థితిని తల్లిదండ్రులు తమ చిన్నారుల పరిస్థితి తెలుసుకునేందుకు బస్సు సిబ్బందికి ఫోన్లు చేయాల్సి వచ్చింది. సుమారు ఎనిమిదిన్నర వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. తరువాత సూర్యుడు మంచు పొరలను చీల్చుతూ పైకి రావడంతో వాతావరణం యథాస్థితికి చేరుకుంది.

-అనపర్తి



సొంతింటి కల సాకారానికి కూటమి చర్యలు

» మే నెలాఖరుకు నిర్మాణ పనులను పూర్తి చేయాలి
» హౌసింగ్ ఈఈ రాజ్‌కుమార్


సూర్యారావుపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ అధికారులు

రాజానగరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్ అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో 2019-2024 మధ్య కాలంలో మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయి, ప్రధాన మంత్రి ఆవాస యోజన(పీఎంఏవై) ఆసరాతో తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించిన లబ్ధిదారుల గృహాలను హౌసింగ్ అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈఈ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పీఎంఏవై 2.0 పథకం కింద సొంత స్థలం ఉండి ఏడాదికి రూ.3 లక్షల ఆదాయ పరిమితి ఉన్న వారికి గృహయోగం కల్పించాలని నిర్ణయించిందన్నారు. రాజానగరం మండల పరిధిలో నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన ఇళ్లు 721 ఉండగా వీటిలో ఎస్సీలు 321 మంది, ఎస్టీలు 7, బీసీలు 393 ఇళ్లు ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయంపై లబ్ధిదారులకు వివరిస్తున్నామన్నారు. ఎస్సీ, బీసీ వర్గాలకు అదనంగా రూ.50 వేలు మంజూరు కాగా, ఎస్టీలకు రూ.75 వేలు, గిరిజన ప్రాంతాల్లో రూ.లక్ష వంతున కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే నెలాఖరు నాటికి నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాపాక సుజాత తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందించిన రూ.50 వేలతో నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించుకున్నామంటూ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఆర్.వెంకటేశ్వరబాబు, రాజానగరం ఏఈ రామారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలకు
463 మంది హాజరు

రంగంపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2, పరీక్షలకు 463 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. ఎ,బి సెంటర్లలో మొత్తం 480 మందికి గాను 17మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షా కేంద్రాలను ప్రాంతీయ తనిఖీ అధికారి(ఆర్ఐవో) వీఎల్ నరసింహం, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించి, ఇన్విజిలేటర్లుగా నియమితులైన వారందరూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కాదా అనే విషయాన్ని పరిశీలించారని సీఎస్‌లు పేర్కొన్నారు.

రూ.100 కోట్లతో రాజమహేంద్రి అభివృద్ధి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


9వ డివిజన్‌లో శిలా ఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 9నెలల్లో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 9వ డివిజన్‌లో రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం రాత్రి ఆయన మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ త్వరలో రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభమౌతున్నాయని, నగరంలో పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మరుకుర్తి శివ యాదవ్, యిన్నమూరి దీపు, కుచర్లపాటి విశ్వనాధరాజు, కొల్లి బుజ్జి పాల్గొన్నారు.

నోడల్ ఆఫీసర్‌ను నియమించండి

కందుకూరి వీరేశలింగం పంతులు విద్యాసంస్థల ఆస్తుల సమన్వయానికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి మయమైన విద్యావ్యవస్థను మంత్రి లోకేశ్ పూర్తిగా గాడిలో పెడుతున్నారన్నారు. కందుకూరి విద్యాసంస్థలను గత ప్రభుత్వం అశాస్త్రీయంగా విలీనం చేసిందని విద్యాసంస్థలను విద్యాశాఖలోను, ఆస్తులను దేవదాయ శాఖలోను , కందుకూరి గృహాన్ని పురావస్తు శాఖకు, మరో ఆస్తిని ట్రస్టుకు అప్పగించారని వివరించారు. వీటన్నింటిని సమన్వయం చేసేందుకు నోడల్ అధికారిని నియమించాలని మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే అదే విద్యాసంస్థలోని డిగ్రీ కళాశాలలో ఉన్న 103 మంది అన్‌ఎయిడెడ్ అధ్యాపకులను పర్మినెంట్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ విద్యాసంస్థల్లో పని చేసేవారు ఈ విద్యాసంస్థలున్నా రాజమండ్రి, పార్వతీపురం, మదనపల్లి మధ్యమాత్రమే బదిలీ అవుతున్నారని అలాకాకుండా ఎక్కడికైనా బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని కోరారు.

గుండె పోటుతో
అటవీశాఖ ఉద్యోగిని మృతి



గోకవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఇందుకూరు ఫారెస్ట్ రేంజి పరిధిలోని దేవారం బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కారం శ్రీదేవి(45) మంగళవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఈమె తన స్వగ్రామమైన రామన్నపాలెంలో ఇంటి వద్ద మంగళవారం అర్ధరాత్రి గుండె పోటుకు గురై తీవ్ర అస్వస్థతకు చెందారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే శ్రీదేవిని గోకవరంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలు శ్రీదేవికి భర్త ఉన్నారు. ఈమె అకాల మృతి పట్ల తోటి ఉద్యోగులు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు.

క్షయపై అవగాహన అవసరం: ఏడీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పట్టి పీడిస్తున్న క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో ఎన్.వసుంధర పేర్కొన్నారు. ప్రపంచ టీబీడే వారోత్సవాల్లో భాగంగా జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, రాజమహేంద్రవరం టీబీ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు ఖైదీలకు బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2035 నాటికి టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఆ దిశగా జిల్లాలో 106 టీబీ రహిత గ్రామ పంచాయతీలను గుర్తించామని చెప్పారు. ప్రతి టీబీ రోగికీ ప్రభుత్వం ఉచిత మందులతోపాటు ఎన్‌పీవై కింద ఇచ్చే రూ.500ని రూ.వెయ్యికి పెంపుదల చేసిందన్నారు. ప్రస్తుత శిబిరంలో 241 మంది క్షయ అనుమానితులను గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, డాక్టర్ కోమల, డాక్టర్ హారిక, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మిగా పాతసోమాలమ్మ


పాత సోమాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలానగర్ శ్రీ పాత సోమాలమ్మ బుధవారం అష్టలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే వాసిరెడ్డి రాంబాబు, పిల్లి నిర్మల, ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం, నగర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణ య్య నేతృత్వంలో డిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన నిర్వహించామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పొడుగు శ్రీను తెలిపారు. ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రి వర్గం ఏర్పడితే బీసీలకు మరింత రాజకీయ , సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని అన్నారు.ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో దినిపై చర్చజరాలని తాము డిమాండ్ చేసామని శ్రీను చెప్పారు.

గౌతమి కోఆపరేటివ్ సూపర్‌బజార్ తనిఖీ అధికారిగా కృష్ణకాంత్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ది గౌతమి కోఆపరేటివ్ సూపర్ బజార్ కార్యకలాపాలపై తనిఖీ అధికారిగా కొవ్వూరు డివిజనల్ సహకార డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్‌ను నియమించినట్టు జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘం చట్టం 1964 ప్రకారం సెక్షన్ 52 తనిఖీకి ఆదేశించారు. తనిఖీలో భాగంగా సూపర్‌బజార్ రికార్డుల పరిశీలన, వాంగ్మూలం నమోదు చేసుకోవాలని నెల రోజులలో తనిఖీ పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్టు కృష్ణకాంత్ తెలిపారు.

మార్కండేయ స్వామి ఆలయానికి
లంబసింగ్ నుంచి ధ్వజస్తంభం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి12(ఆంధ్రజ్యోతి): 150 ఏళ్ల చరిత్ర గల స్థానిక ఉమా మార్కండేయ స్వామి ఆలయంలోని ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన మేరకు శెట్టి జగదీష్, ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠకు, దాత చెక్కా రవిశంకర్ సహకారంతో లంబసింగి నుంచి ధ్వజస్తంభానికి కావలసిన చెట్టును తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకు సుమారు 25 లక్షలు ఖర్చు అవుతుందని శెట్టి జగదీష్ తెలిపారు.

వైసీపీ ఆవిర్భావ వేడుకలు

రంగంపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పలుచోట్ల పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వడిశలేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇశ్రాయేలు, పోతుల బుల్లి వీర్రాజు, నలమాటి భీముడు, మావిరెడ్డి శ్రీరామ్, నలమాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కడియం: స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వైసీపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరజాల బాబు, యాదల స్టాలిన్, తాడాల చక్రవర్తి, ఊటుకూరి శైలజ, తిరుమలశెట్టి శ్రీను పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పార్టీ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కడియంలో కేక్ కట్ చేస్తున్న వైసీపీ నాయకులు

52 మంది యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక దానవాయిపేటలో వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలమేరకు మెప్మా అధికారులు అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు వృత్తినైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. దీనిలో భాగంగా 52 మందికి ప్లంబింగ్, మరికొంత మందికి ఎలక్ట్రికల్ పనుల్లో శిక్షణ అందిచామని మెప్మా సిటీ మిషన్ మేనేజరు రామలక్ష్మి తెలిపారు. వివిధ వృత్తుల చేసేవారిని ఎంపిక చేసి నిర్దేశిత సమయంలో నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధి ఉద్దేశపు వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు శ్రీనివాసులు, కొత్తపల్లి గీత, కుడుపూడి లక్ష్మిశైలజ, అధికారి లక్ష్మి, కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ల ఎస్టేట్ అధికారుల మూకుమ్మడి బదిలీ

రెండేళ్లు దాటిన అందరినీ మార్చిన ఉన్నతాధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుబజార్ల ఎస్టేట్ అధికారులను మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఒక చోట నుంచి మరోచోటకు బదిలీ చేశారు. రెండేళ్లు దాటిన అందరినీ మూకుమ్మడిగా బదిలీ చేస్తూనే రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలో అంతర్గతంగా ఈ బదిలీ ప్రక్రియ చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల వై.జంక్షన్ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ రొజియాను క్వారీ మార్కెట్ రైతు బజార్‌కు బదిలీ చేస్తూ, ఇక్కడికి గణేష్‌చౌక్ రైతుబజార్ ఎస్టేట్ అధికారి శ్రీనివాస్‌ను తీసుకొచ్చారు. గణేష్‌చౌక్‌కు గోదావరిగట్టు ఆల్కట్‌గార్డెన్స్ రైతుబజార్ ఎస్టేట్ అధికారి సత్యనారాయణను బదిలీ చేస్తూ, క్వారీ మార్కెట్ రైతుబజార్ ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావును గోదావరిగట్టు ఆల్కట్‌గార్డెన్స్ రైతు బజార్‌కు పంపించారు. అలాగే, నటరాజ్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి వెంకటేశ్వరరావును మార్కెట్‌యార్డు రైతు బజార్‌కు, అక్కడ పనిచేస్తున్న భాస్కర్‌ను నటరాజ్ రైతు బజార్‌కు బదిలీ చేశారు. శంభూనగర్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి రామకృష్ణను వీఎల్ పురం రైతుబజార్‌కు బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న తేజను శంభూనగర్ రైతుబజార్ ఎస్టేట్ అధికారిగా నియమించారు. నెల రోజుల కిందటే ఎస్టేట్ అధికారుల బదిలీలకు ఫైల్ సిద్ధమైనా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. కాగా, లాలాచెరువు రైతుబజార్ ఎస్టేట్ అధికారి విధులు చేపట్టి రెండేళ్లు పూర్తికాకపోవడంతో బదిలీ లేదు. అలాగే శాటిలైట్ సిటీ, కొవ్వూరు రైతుబజార్లకు ఎస్టేట్ అధికారులు లేకపోవడంతో ఈ రెండు రైతుబజార్లకు ఇన్‌చార్జ్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. రైతుబజార్ల ఎస్టేట్ అధికారుల మూకుమ్మడి బదిలీలతోనైనా రైతుబజార్లలోని దళారీల వ్యవస్థ ప్రక్షాళన జరుగుతుందా లేదా అనేది వేచి చూడాలి.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరండి


నల్లజర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ బహిరంగ సభకు నల్లజర్ల మండలం నుంచి పెద్దఎత్తున జనం తరలిరావాలని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చోడసాని బాపిరాజు అన్నారు. బుధవారం నల్లజర్లలో గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి బస్సు సౌకార్యం ఏర్పాటు చేశామని, జనసేన అభిమానులు, నాయకులు కార్యకర్తలు, వీర మహిళలు బహిరంగ సభకు తరలిరావాలన్నారు. నల్లజర్ల నుంచి ర్యాలీగా దేవరపల్లి డైమాండ్ జంక్షన్ వరకు వెళ్లి మూడు నియోజకవర్గ కార్యకర్తలతో భారీ ర్యాలీ పిఠాపురం వెళ్లాలన్నారు. ఉన్నమట్ల ఇస్సాకు, వరున్,తలంశెట్టి మోహన్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురు) సా.6.21
సహరి (శుక్ర) ఉ.4.51

విజయ కేతనం!



- పిఠాపురం వేదికగా రేపే జనసేన 12వ రాష్ట్ర ఆవిర్భావ పండగ
- రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది వస్తారని అంచనా
- పిఠాపురంలో పవన్ అఖండ విజయం నేపథ్యంలో ఇక్కడే సభకు మొగ్గు
- సభకు జయకేతనంగా నామకరణం.. ద్వారాలకు మన ప్రాంతీయుల పేర్లే
- సభలో మహిళలు, మత్స్యకారులు, యువత, రైతు ప్రతినిధుల ప్రసంగాలు
- అటు ఉమ్మడి జిల్లా కేంద్రంగా అయిదేళ్లలో ఉవ్వెత్తున జనసేన పోరాటాలు
- అప్పటి అధికార వైసీపీపై ఇక్కడ నుంచే స్వయంగా పవన్ దండయాత్ర
- రైతు సౌభాగ్య దీక్ష నుంచి వారిని ఆదుకోవడం వరకు ఎన్నో మైలురాళ్లు
- అటు ఎన్నికల్లో సునామీ తీర్పుతో జనసేన వెంట నడిచిన గోదావరి జనం
- వైసీపీకి ఒక్క సీటూ రానివ్వనన్న పవన్ శపథాన్ని నిజం చేసిన గోదారోళ్లు
- జనసేన రాజకీయ చరిత్రలో ఉమ్మడి జిల్లాకు ఎప్పుడూ ప్రత్యేక స్థానమే





పిఠాపురం మండలం చిత్రాడలో జనసేన ఆవిర్భావ సభ 'జయకేతనం' కోసం వేదిక.. డిప్యూటీ సీఎం పవన్ రాక నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వేదికగా జనసేన పార్టీ జయకేతన సభకు సర్వసన్నాహాలు చేస్తోంది. పిఠాపురం కేంద్రంగా పార్టీ 12వ రాష్ట్ర స్థాయి ఆవిర్భావసభకు కనివినీ ఎరుగని భారీ ఏర్పాట్లు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కనివినీ ఎరుగని సునామీ విజయం సాధించి ఉవ్వెత్తున ఎగసిన జనసేన తన విజయ ప్రస్థానాన్ని గోదావరి జిల్లా వేదికగా పంచుకోవాలన్న సంకల్పంతో ఇక్కడే సభను నిర్వహిస్తోంది. అటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అనేక ఆటుపోట్ల తర్వాత తొలిసారి ఎమ్మెల్యేగా విజయం రుచి చూసి రాష్ట్ర రాజకీయ దశ, దిశను గోదావరి జిల్లా నుంచే మార్చినందున పిఠాపురం ఎమ్మెల్యే హోదాలో సభను ఇక్కడే నిర్వ హిస్తున్నారు. మరోపక్క జనసేన అంటే ఉమ్మడి తూర్పు అనేలా పార్టీ ప్రస్థానం గడచిన పన్నెండేళ్లలో సాగింది. పవన్ ఉద్యమాలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు.

అందరి దృష్టి ఇక్కడే...

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభను శుక్రవారం పిఠాపురంలో అంచనాలకు మించి విజయవంతం చేసేందుకు ఆ పార్టీ ఎక్కడికక్కడ పక్కా ఏర్పాట్లు చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో రెండు లక్షల మంది కూర్చునేలా ఏర్పాట్లు సిద్ధంచేస్తోంది. రాష్ట్రంతోపాటు తెలంగాణ, బెంగళూరు, చెన్నై తదితర రాష్ట్రాల నుంచి లక్షల మంది సభకు వస్తారని అంచనా. దీంతో స్వయంగా మంత్రి నాదెండ్ల కాకినాడలోనే మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే వీరికి ఎక్కడా ఏ ఇబ్బంది ఎదురు కాకుండా వేలాదిమంది పోలీసులు, అంబులెన్స్‌లు, భోజన వసతి కల్పిస్తున్నారు. అయితే తొలుత అమరావతిలో మూడు రోజులు నిర్వహించాలని భావించిన ఆవిర్భావ సభను ఆ తర్వాత గోదావరి జిల్లాకు మార్చారు. జనసేనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయంగా సెంటిమెంట్‌గా మారిన నేపథ్యంలో ఇక్కడి నుంచే తన విజయకేతన సభను నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో పవన్ సైతం సభావేదికకు విజయకేతన సభ అని స్వయంగా నామకరణం చేశారు. అలాగే సభకు మూడు ప్రవేశ ద్వారాలు ఏర్పాటుచేయగా, వాటికి పిఠాపురం రాజా శ్రీరాజా సూర్యారావు బహదూర్, విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్, అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మల పేర్లు పెట్టడం ద్వారా ఉమ్మడి జిల్లాకు తగిన ప్రాధాన్యం కల్పించారు. రాజకీయంగా ఇన్నేళ్లల్లో ఎన్నో ఆటుపోట్లను చూసిన జనసేనకు 2024 ఎన్నికలు కనివినీ ఎరుగని విజయాన్ని కట్టబెట్టడం, తొలిసారి అధికారంలోకి రావడంతో సాకారమైన కలను అచ్చొచ్చిన గోదావరి జిల్లా నుంచే పంచుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడే సభ నిర్వహిస్తున్నారు. దీంతో ఇప్పుడు రాష్ట్రంలో అందరి దృష్టి పిఠాపురంపైనే పడింది. తనకు రాజకీయంగా అండగా నిలబడుతోన్న గోదావరి జిల్లాలోని పిఠాపురం నుంచే 2024లో బరిలోకి దిగారు. అఖండ మెజార్టీతో విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా తిరుగులేని విజయం సాధించిపెట్టడంతో గోదావరి జిల్లాపై మరింత ప్రేమతో ఇక్కడి నుంచే తన విజయ ప్రస్థానం పంచుకోవాలని పవన్ భావిస్తున్నారు. అటు సభలో పిఠాపురంలో తనను గెలిపించిన ప్రజలకు పవన్ ధన్యవాదాలు తెలపనున్నారు. మరోపక్క సభ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానుంది. మొత్తం ఐదు గంటలపాటు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవన్‌కల్యాణ్ ప్రసంగంతో సభ ముగుస్తుంది.

పోరాటమే ఊపిరిగా..

జనసేన పార్టీ పుట్టిందే ప్రజాసమస్యలపై పోరుకోసం. పార్టీ ఆవిర్భావం నుంచి అధికారంలోకి వచ్చిన వరకు ఇన్నేళ్లలో ఎన్నో సమస్యలపై జనంకోసం జనసేన పోరాటాలు చేసింది. స్వయంగా పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అనేక సమస్యలపై పోరాటాలను తూర్పుగోదావరి జిల్లా నుంచే ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలు, అక్రమాలపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కదిలి అప్పటి సర్కారు వెన్నులో వణుకు పుట్టించారు. దీంతో జనం తమ సమస్యల కోసం ఎన్నోసార్లు జనసేనవైపు చూశారు. ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ పాలనలో అన్నదాతలు తీవ్రంగా నలిగిపోయారు. సాగునీటి నుంచి గిట్టుబాటు ధర వరకు సమస్యలే. దీంతో 2019 డిసెంబరులో కాకినాడ కేంద్రంగా రైతు సౌభాగ్య దీక్షతో ప్రభుత్వాన్ని కదిలించారు. రహదారుల గుంతలతో జనం పడుతున్న నరకయాతన నేపథ్యంలో ప్రభుత్వాన్ని కదిలించడం కోసం 2021 అక్టోబరులో రాజమహేంద్రవరంలో పవన్ పర్యటించారు. స్వయంగా రహదారులపై గుంతలు పూడ్చారు. 2022లో కౌలురైతు భరోసా యాత్ర పేరుతో మండపేటలో అన్నదాతల కుటుంబాలకు సొంతంగా చెక్‌లు పంపిణీ చేశారు. ఇలా ఒకటేంటి అనేక సమస్యలపై చలించి కదిలారు. ఇలా ప్రతి కష్టంలోను జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రజా సమస్యలపై ఉద్యమమై కదిలింది. అనేకసార్లు పవన్ మాట్లాడుతూ జనసేనకు అధికారం ముఖ్యం కాదని జనం సమస్యలు పరిష్కారమే కీలకమని ప్రకటించారు. ప్రజల కోసం ప్రభుత్వాలపై ఎంత వరకు అయినా పోరాడుతుందని చేసి చూపించారు. దీంతో గడచిన అయిదేళ్లలో గోదావరి జిల్లా ప్రజల గుండెల్లో మరింతగా నాటుకుపోయింది. దీని ఫలితంగా పంచాయతీ, జడ్పీ, మున్సిపల్ ఎన్నికల్లో చిన్నచిన్న విజయాలతో జిల్లాలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనసేనకు టీడీపీతో పొత్తు కుదరడంతో ఆ కలయిక గోదావరి జిల్లాలో ఓట్ల సునామీ సృష్టించింది. దీంతో అరాచక ప్రభుత్వాన్ని దించి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. అయితే అధికారం అండతో గత వైసీపీ ప్రభుత్వం గోదావరి జిల్లాను ధ్వంసం చేసి అరాచకంగా మార్చేసిందని ఎన్నికలప్పుడు పవన్ ధ్వజమెత్తారు. అందుకే గోదావరి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా చూసుకునే బాధ్యత తనది అని హెచ్చరించారు. పవన్ చేసిన శపథానికి గోదావరి ప్రజలు అండగా నిలబడి నిజం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఒక్కటంటే ఒక్క సీటూ వైసీపీకి రాకుండా గుండా సున్నా మిగిల్చారు.



అసంపూర్తి ఇళ్లకు అదనపు సాయం

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారంతో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పీఎంఏవై 1.0 అర్బన్, గ్రామీణ్ 1.0 పథకాల ద్వారా 429 లేఅవుట్లలో, సొంత స్థలాల్లో ఇళ్లు మంజూరుకాగా, వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి 11,345 మంది ఎస్సీలు, 549 మంది ఎస్టీలు, 15547 మంది బీసీలు కలిసి 27,441 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం కింద రూ. 138.57 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా ఎస్సీలకు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల మేర ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం వారు ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిదారులంతా మే నెలాఖరు నాటికి పూర్తిచేయాలని కోరారు. జూన్ 4వ తేదీ నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మన జిల్లాకు 10,794 ఇళ్లు పూర్తిచేసేందుకు లక్ష్యంకాగా, ఇప్పటివరకు 4,796 ఇళ్లు పూర్తిచేశామని కలెక్టర్ తెలిపారు.

హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు

ఢిల్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గత ఏడాది ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబడిన హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ -2024లో హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ కోసం ప్రైమ్‌మినిస్టర్స్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్సీ కోసం పోర్టల్‌లో సమర్పించబడిన ఆన్‌లైన్ అప్లికేషన్‌కు సంబంధించి జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఢిల్లీలోని ఎలక్ట్రానిక్స్ నికేతన్‌లో స్క్రీనింగ్ కమిటీ ఎదుట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, ఈ ప్రాజెక్టు ఇన్నోవేషన్ కేటగిరీలో ఎంపికైంది.

పర్యాటక శాఖకు 116 ఎకరాలు, వ్యవసాయ కళాశాలకు 10 ఎకరాలు కేటాయింపు

జీవో జారీచేసిన ప్రభుత్వం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంగ్రామ పరిధిలోని సర్వేనెంబరు 386/6లో గల 10.72 ఎకరాల రెవెన్యూ స్థలాన్ని వ్యవసాయ కళాశాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 92ను జారీ చేసింది. మంగళగిరి కమిషనర్ అండ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ పరిధిలోని భూమిని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలకు ఉచితంగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు తదుపరి చర్యలు నిమిత్తం జీవోను జారీచేసి ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కాతేరు శివారు గామన్ బ్రిడ్జి రోడ్డులోని కళాశాల నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వం జీవో 90 పేరుతో మరో ఉత్తర్వుని కూడా విడుదల చేసింది. దీని ప్రకారం.. రాజమహేంద్రవరం గోదావరి బ్రిడ్జిలంకలోని 116.974 ఎకరాల లంక భూమిని పర్యాటక శాఖకు అభివృద్ధి నిమిత్తం కేటాయించింది.

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు గుండెపోటుతో మృతి

ఆన్‌లైన్‌లో పొలం పేరు మార్పు కోసం నిలదీత.. ఆ సమయంలోనే మరణం.. బంధువుల ఆందోళన

దేవరపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యానికి ఓ రైతు బలయ్యాడు. తమ పొలానికి సంబంధించి ఆన్‌లైన్‌లో తప్పు పేరు రావడంతో మార్పుకోసం తిరుగుతూ తహశీల్దార్ కార్యాలయం వద్దే గుండెపోటుకు గురై మరణించాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దెయ్యాల వెంకట్రావు (44) తన అత్త పాటెమ్మ వాటాకు రావాల్సిన 60 సెంట్ల భూమిని అత్త మేనల్లుడు అయిన పోలిమాటి రమేష్ పేరుపై ఆన్‌లైన్‌లోకి ఎక్కించడంతో 20 రోజులుగా ఆ పేరు మార్పు కోసం గ్రామ సర్వేయర్ దుర్గారావు చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం సాయంత్రం సర్వేయర్ దుర్గారావు మృతుడు వెంకట్రావుకు తహశీల్దార్ కార్యాలయానికి రావాలని తెలియజేయడంతో వెంకట్రావు తన భార్య రత్నకుమారిని తీసుకుని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. తన అత్త పాటెమ్మ పేరుమీద ఉన్న 60 సెంట్లు భూమిని తన అత్త పేరు మీద ఆన్‌లైన్ చేయాలని అధికారులను కోరాడు. ఈ క్రమంలో గ్రామ సర్వేయర్ దుర్గారావు, మండల సర్వేయర్ డిల్లేశ్వరరావులకు రైతుకి మధ్య వాగ్వాదం జరిగింది. వెంకట్రావు ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆటోలో మృతదేహాన్ని తహశీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. మృతుని భార్య రత్నకుమారి విలపిస్తూ తన భర్త మృతికి కారణం రెవెన్యూ అధికారులేనని ఆరోపించారు. మృతుని భార్య ఫిర్యాదుమేరకు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మృతుడు వెంకట్రావు.. (ఫైల్‌ఫోటో)



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

జిల్లా కలెక్టరేట్ వద్ద వైసీపీ యువత పోరు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో యువత పోరు నిరసన కార్యక్రమం జరిగింది. నగరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సోదరుడు జక్కంపూడి గణేష్ దానవాయిపేట నుంచి ర్యాలీగా బయలుదేరగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మోరంపూడి నుంచి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. వీరు కలిసి కలెక్టరేట్ వరకు వెళ్లలేదు. రూరల్‌లోని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు కార్యాలయానికి చేరుకుని అక్కడ నుంచి కూడా ఎవరివర్గంతో వారే కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యానారాయణరెడ్డి, మాజీ హోంమంత్రి తానేటి వనిత, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షర్మిళారెడ్డి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. 45 నిమిషాలపాటు నిరసన నిర్వహించారు. జేసీ చిన్నరాముడుకి వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం 9 నెలల్లో చేసిందేమీలేదని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని వారు ఆరోపించారు.



జిల్లా కలెక్టరేట్‌లో జేసీ చిన్నరాముడుకి వినతిపత్రం సమర్పిస్తున్న వైసీపీ నాయకులు

వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు 8

అనధికార కట్టడాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

● కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్



కొవ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో అనధికారికం గా నిర్మించిన ప క్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరి స్తున్నట్లు కొవ్వూరు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. 2025 జనవరి 29న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.30 ప్రకారం 2019 అక్టోబరు 15వ తేదీ కంటే ముందుగా కొవ్వూరు పట్టణ, మండలంలోని అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి ఇళ్లను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందన్నారు. అనధికారికంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన ఇంటి యజమానులు క్రమబద్ధీకరణకు సంబంధించి ఇంటి పన్ను, కరెంటు బిల్లులతో తమ వార్డు, గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 150చదరపు గజాల్లో నిర్మించిన ఇంటిని ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్నారు. సచివాలయాలకు వచ్చిన దరఖాస్తులను మండల కమిటీ, డివిజనల్ కమిటీలు పరిశీలించి క్రమబద్ధీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు సచివాలయాల్లో రెవెన్యూ సెక్రటరీలను సంప్రదించాలని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కరగపాడులో ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి విగ్రహం

గోపాలపురం, మార్చి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరగపాడు గ్రామంలో 21అడుగుల శ్రీఅభయాంజ నేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం 10.42 నిమిషాలకు వేదమంత్రోచ్చరణలతో, మేళతాళాల మధ్య స్వామివారి విగ్రహాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. గ్రామంలో రామాలయంవద్ద విగ్రహ కమిటీ ఆధ్వ ర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించా రు. గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు గెల్లా శ్రీనుబాబు 12కిలోల బరువు కలిగిన శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ పంచలోహ విగ్రహాలను ఆలయ కమిటీ వారికి అందించారు.

అంగన్వాడీ సెంటర్ స్టాక్‌లో అవకతవకలు

● గుర్తించిన ఫుడ్ కమిటీ సభ్యుడు జక్కంపూడి కిరణ్



కొవ్వూరు అంగన్వాడీ కేంద్రంలో తనిఖీచేస్తున్న ఫుడ్ కమిటీ సభ్యుడు జక్కంపూడి కిరణ్, దేవరపల్లిలో హాస్టల్‌లో తనిఖీ చేస్తున్న కిరణ్

కొవ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని పాఠశాలలను ఫుడ్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. బుధవారం కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని పాఠశాలలు, రేషన్‌షాపులు, చాగల్లు ఎంఎస్ఎల్ పా యింటును ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ తనిఖీ చేశారు. కొవ్వూరు పట్టణంలోని రాజీవ్‌కాలనీలో అంగన్వాడీ సెంటర్ స్టాక్‌లో అవకతవకలు ఉండడంతో మెమో ఇవ్వాలని ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారిని ఆదేశించారు. దేవరపల్లి మండలంలో బీసీ గర్ల్స్ ప్రీ మెట్రిక్ హాస్టల్, బీసీ బాయ్స్ హాస్టల్, చేనెగూడెంలో ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనంచేసి లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం పెట్టాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. సివిల్ సప్లై ఇన్‌చార్జి డీహెచ్‌వో నాగాంజనేయులు, పౌరసరఫరాలశాఖ డీఎం టి.రాధి క, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో హాస్టళ్ల తనిఖీ

దేవరపల్లి: విద్యార్థులు సమస్యలను స్లిప్‌ల రూపంలో వారి అభిప్రాయాలను సిక్రెట్‌గా సేకరించామని రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు జక్కంపూడి కిరణ్ అన్నారు. దేవరపల్లిలో బుధవారం సాయంత్రం దేవరపల్లి బీసీ, ఎస్టీ హాస్టల్స్ అలాగే యర్నగూడెం చిన్నాయిగూడెం హాస్టల్స్ కూడా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి కిరణ్ మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులకు అంటువ్యాధులు ప్ర బలుతున్నాయని వాటి నివారణకు వారంవారం వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని వార్డెన్లకు ఆదేశించారు. ఆహారం సరిగా అందుతుందా లేదా మెనూ ప్రకారం అందజేస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని హాస్టల్స్‌లోనూ సౌకర్యాలు సక్రమంగానే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో బీసీ హాస్టల్స్ 1092 ఉన్నాయని, అందులో విద్యార్థులు 90వేలమంది ఉన్నారని, ఎస్సీ హాస్టల్స్‌లో 1044 ఉన్నాయని 84600మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. కార్యక్ర మంలో డీబీసీడబ్ల్యూవో శశాంక్, డీటీసీడబ్ల్యూవో కే.నాగజ్యోతి, ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణచైతన్య ఆశ్రమంలో 14న ధ్వజస్తంభ పునప్రతిష్ఠ

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యాపురంలో గల శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో 14వ తేదీ శుక్రవారం శ్రీ చైతన్య ప్రభువుల 538 ఆవిర్భావ వేడుకలు, ధ్వజస్తంభ పునప్రతిష్ఠ మహోత్సం జరుగుతాయని, భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి కోరారు.

ఉండ్రాజవరంలో 10 కాసుల బంగారం, రూ.5లక్షలు చోరీ

ఉండ్రాజవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో 10 కాసుల బంగారం, రూ.5లక్షల నగదు దోచుకెళ్లారు. ఎస్ఐ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండ్రాజవరంలోని నిమ్మతోటలో ఉంటున్న సీపాని చిరంజీవి, అతని భార్య సీపాని విజయలక్ష్మి మంగళవారం ఉదయం ఇంటికి తాళాలువేసి బయటకు వెళ్లారు. ఈనెల 29న వారి కుమారుడు నరేష్ పెళ్లి సందర్భంగా రూ.5లక్షలు నగదు బీరువాలో దాచారు. అదేవిధంగా 10కాసుల బంగారం బీరువాలో ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక గేటు నుంచి వచ్చి తలుపులు పగుల గొట్టి బెడ్ రూమ్‌లోని బీరువా పగులగొట్టి రూ.5లక్షలు నగదు, 10కాసుల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. సీపాని విజయలక్ష్మి ఇంటికి వచ్చి తలుపులుతీసి ఉండటం, బెడ్ రూమ్ బీరువాలో తెరిచి ఉండటం చూసి పోలీసులకు విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ తిలక్, ఎస్ఐ జి.శ్రీనివాసరావు పరిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో మృతదేహం లభ్యం

పెరవలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండవల్లి శివారు లంకమాలపల్లి పరిధిలో సిద్ధాంతం కాలువలో పాడైపోయిన మృతదేహాన్ని పెరవలి పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి, గుర్తుపట్టలేనివిధంగా ఉన్న మృతదేహం లభ్యమయ్యిందన్నారు. ఈ సమాచారాన్ని జిల్లాలోని పోలీసుస్టేషన్లకు అందించామని, ఈ వ్యక్తి కొవ్వూరు మండలం పంగిడికి చెందిన ఆవుగడ్డ మల్లిఖార్జునరావుదిగా నిర్ధారణ అయ్యిందన్నారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు 12 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎకనామిక్స్ ఫిజిక్స్ పరీక్షలు కొవ్వూరులో ప్రశాంతంగా జరిగాయి. బుధవారం పట్టణ మండలంలో 489 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాల్సి ఉండగా 477 మంది హాజరయ్యారు, 12 మంది గైర్హాజరయ్యారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షలకు 267 మందికిగాను 260 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 148 మందికిగాను 143 మంది హాజరవ్వగా ఐదుగురు గైర్హాజరయ్యారు. మండలంలోని కుమారదేవం గురుకుల కళాశాలలో 74 మందికి 74 మంది హాజరైనట్లు కళాశాలల అధ్యాపకులు తెలిపారు.

మే నెలాఖరుకి గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

కొవ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లబ్ధిదారులు మే నెలాఖరుకి నిర్మాణాలు పూర్తిచేయాలని హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం గ్రా మంలో బుధవారం పర్యటించి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం వివరాలను తెలియజేశారు. కొవ్వూరు మండలంలో ఎస్సీలు 655, ఎస్టీలు 17, బీసీలు మొత్తం 1261మంది, పట్టణ పరిధిలో ఎస్సీలు 472, ఎస్టీలు 33, బీసీలు 139 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ ఏఈ డి.చాంబర్లిన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడిగా కాళీకృష్ణ



దేవరపల్లి, మార్చి 12(ఆంధ్ర జ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడిగా దేవరపల్లి గ్రామానికి చెందిన శ్రీకాకు ళపు కాళీకృష్ణ నియమితులయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పదవిలో 2025మార్చి నుంచి 2027 మార్చి 29వ తేదీ వరకు కొనసాగుతారని అన్నారు. కాళీకృష్ణ ఆర్యవైశ్య సంఘంలో ఎన్నో పదవులు నిర్వహించి సామాజిక కార్యక్రమాల్లో ఎన్నో సేవలందించారు. సామాజికవేత్తగా బడుగు బలహీన వర్గాలకు ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులకు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు.

గౌతమి కోఆపరేటివ్ సూపర్ బజార్ తనిఖీ అధికారిగా కృష్ణకాంత్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ది గౌతమి కోఆపరేటివ్ సూపర్ బజార్ కార్యకలాపాలపై తనిఖీ అధికారిగా కొవ్వూరు డివిజనల్ సహకార డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్‌ను నియమించినట్లు జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

● మూడోరోజున పోటెత్తిన భక్తులు



కొండపైన ఉన్న లక్ష్మీనరసింహస్వామి, వేదికపై ఆశీనులైన స్వామి, అమ్మవారు

కోరుకొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం కోరుకొండ తీర్థానికి భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు కొండపైన వెలసిన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. కొండ దిగువున స్వామివారిని భక్తులు దర్శించుకుంటున్నారు. వీరందరికీ అర్చకస్వాములు కొండపైన, కొండదిగువన స్వామివారి సర్వదర్శనం కల్పించారు.

వైభవంగా నరసింహస్వామి సదస్యం

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 8గంటలకు స్వామి ఆలయ ముఖ మండపంలో అన్నవరం దేవస్థానం నుంచి వచ్చిన వేద పండితులు, ఉభయ వేదాంత పండితులు సమక్షంలో స్వామివారి సదస్యం వైకానస ఆగమశాస్త్రం ప్రకారం ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అర్చక స్వాములు నిర్వహించారు. స్వామివారి కల్యాణం జరిగిన తరువాత 3వ రోజు స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల సమక్షంలో వేదిక పై ఆశీనులు గావించి అమ్మవారివంశాన్ని, గొప్పతనాన్ని కొందరు పండితులు వివరించగా, మరి కొంత మంది పండితులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వంశాన్ని, గొప్పతనాన్ని వివరించారు. వేద పండితులు స్వామివారికి, అమ్మవారికి మంగళాశాసనం చేశారు. ప్రస్తుత రోజుల్లో వివాహం అయిన తరువాత జరిపే రిసెప్షన్ వంటిదే ఈ సదస్యం. స్వామివారి కల్యాణానికి రాలేకపోయినవారు ఈ సదస్యానికి విచ్చేసి స్వామి అమ్మవార్ల ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మినరసింహ భట్టర్, రంగరాజ భట్టర్, రఘునాథ భట్టర్, అనువంశక అర్చక స్వాములు, అన్నవరం దేవస్థానం అధికారులు, ఈవో వీర్ల సుబ్బారావు, ఉత్సవాల ముఖ్యఅధికారి చంద్రశేఖర్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి వాహనంపై స్వామి గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణమహోత్సవాల్లో భాగంగా 3వ రోజు రాత్రి 9గంటలకు ఆంజనేయ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి సదస్యం అనంతరం అర్చక స్వాములు స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించి వేదమంత్రాలతో తీసుకువచ్చి ఆంజనేయ వాహనంపై ఉంచారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, మంగళహారతులు,నివేదనలు అందించారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అదే విధంగా స్వామివారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు.

నిడదవోలు రైల్వే జంక్షన్‌లో రైల్వే జీఎం తనిఖీలు



నిడదవోలు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌ను పరిశీలిస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నిడదవోలు రైల్వే జంక్షన్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తనిఖీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమృత భారత్ పథకం ద్వారా సుమారు 27 కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

నిడదవోలు రైల్వే జంక్షన్‌లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, రంగా రమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, పట్టణ ప్రజల సంక్షేమ సంఘం తరఫున జువ్వల రాంబాబు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలసి నిడదవోలు జంక్షన్‌లో జన్మభూమి, ఎల్‌టీడీ, అమరావతి రైళ్లకు హాల్ట్ కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరండి



మండల పార్టీ సమావేశంలో మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు చోడసాని బాపిరాజు

నల్లజర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ బహిరంగ సభకు నల్లజర్ల మండలం నుంచి పెద్దఎత్తున జనం తరలిరావాలని జనసేన మండల పార్టీ అధ్యక్షు డు చోడసాని బాపిరాజు అన్నారు. బుధవరం నల్లజర్లలో గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, జనసేన అభిమానులు, నాయకులు కార్యకర్తలు, వీర మహిళలు బహిరంగ సభకు తరలిరావాలన్నారు. నల్లజర్ల నుంచి ర్యాలీగా దేవరపల్లి డైమాండ్ జంక్షన్ వరకు వెళ్లి మూడు నియోజకవర్గ కార్యకర్తలతో భారీ ర్యాలీ పిఠాపురం వెళ్లాలన్నారు. ఉన్నమట్ల ఇస్సాకు, వరున్,తలంశెట్టి మోహన్, జవ్వాది భార్గవ్, కొత్తపల్లి హరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

దేవరపల్లి: జనసేన ఆవిర్భావ దినోత్సవానికి భారీగా తరలిరావాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు కోరారు. దేవరపల్లిలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న పిఠాపురం చిత్రాడలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవానికి నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి జనసేన నాయకులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిర్భావ దినోత్సవానికి బస్సులు, మోటర్‌సైకిళ్లు, కార్లతో తరలి వెళతామని వీరికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి శేషరావు, కంబాల సత్తిబాబు, తంబా శ్రీనివాసు, ఆకు నాని, సిద్ధా తాతాబ్బాయి, కవల సీతా రత్నసూర్యకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులు సోదర భావంతో మెలగాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు తమ తోటి వాళ్లతో స్నేహ పూర్వకంగా, సోదర భావంతో మెలగాలని.. ఆకతాయి పనులు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కా ర్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి విద్యార్థులకు సూచించారు. బుధవారం బీసీ బాలికల సమీకృత సంక్షేమ వసతిగృహంలో 'నల్సావారి.. బాల బాలికలకు స్నేహపూర్వక న్యా య సేవలు, వారి సంరక్షణ పథకం-2024', మంచి చెడు స్పర్శలు, పోక్సో చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాల న్నారు. బాల బాలికలు తమపట్ల జరిగే అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే పోలీసులకు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. మంచి, చెడు స్పర్శల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా డీఎల్ఎస్ఏని సంప్ర దించాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణా గృహాన్ని సందర్శించారు. మోసపూరిత వ్యక్తుల ప్రలోభాల వలలో పడకుండా తెలివిగా వ్యవహరించాలని వారికి సూచించారు. ఆలోచనా రహితంగా చేసే పనుల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

పరిశోధనల్లో 'ఏబీఎన్' విద్యార్థుల ప్రతిభ

కొవ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఏబీ ఎన్, పీఆర్ఆర్ కళాశాల వి ద్యార్థులు ఆధునిక సాంకేతిక తలను ఉపయోగించి వివిధ రంగాలలో పరిశోధనలు నిర్వహిస్తున్నారని ప్రిన్సిపాల్ డా. ఎం.రామ్మోహన్ తెలిపారు. విద్యార్థులు బాసిల్లస్ సెరియస్, ఏరోమోనాస్ ధకేన్సిస్ లాంటి బ్యాక్టీరియా 16ఎస్ రైబోసోమల్ ఆర్ఎన్ఏ జీన్‌పై సమగ్ర పరిశోధన నిర్వహించి, ఫలితాలను ఎన్‌సీబీఐలో ఫలితాలను ప్రచురించారన్నారు. ఈ పరిశోధనలో బ్యాక్టీరియా 16ఎస్ ఆర్ఎన్ఏ జీన్ సీక్వెన్స్ విశ్లేషణ ద్వారా బ్యాక్టీరియాల మధ్య ఫైలో జెనిటిక్ సంబంధాలను, వేర్వేరు జెనోటైప్స్ మధ్య వ్యత్యాసాలను గుర్తించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వై.రమేష్, మాధురీదేవి, కె.సురేష్‌బాబు, టి.శశికళ, బి.రత్న, దీపిక, ఎ.మల్లిక పాల్గొన్నారు.



పరిశోధనలలో పాల్గొన్న విద్యార్థులు

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

● అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో వసుంధర



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఖైదీలు

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్ర జ్యోతి): సమాజాన్ని పట్టి పీడిస్తున్న క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో ఎస్.వసుంధర పేర్కొన్నారు. ప్రపంచ టీబీడే వారోత్సవాల్లో భాగంగా జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, రాజమహేంద్రవరం టీబీ యూనిట్ సం యుక్త ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు ఖైదీలకు బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2035 నాటికి టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దడా నికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఆ దిశగా జిల్లాలో 106 టీబీ రహిత గ్రామ పంచాయతీలను గుర్తించామని చెప్పారు. ప్రతి టీబీ రోగికీ ప్రభుత్వం ఉచిత మందులతోపాటు ఎన్‌పీవై కింద ఇచ్చే రూ.500 ని రూ.వెయ్యికి పెంపుదల చేసిందన్నారు. ప్రస్తు త శిబిరంలో 241 మంది క్షయ అనుమాని తులను గుర్తించామన్నారు. జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, డాక్టర్ కోమల, డాక్టర్ హారిక, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

కాతేరులో రూపుదిద్దుకున్న ఆంజనేయస్వామి విగ్రహం



ఆలయంలో కొలువు దీరిన ఆంజనేయుడు

రాజమహేంద్రవరంరూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం రాజమండ్రిరూరల్ మండలం కాతేరులో రూపుదిద్దుకున్న ఆంజనేయస్వామి కర్నాటకలోని రాయచూర్‌జిల్లా శింధునూరు తాలూకా అరటితోట క్యాంప్‌లోని ఆలయంలో కొలువుదీరాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అరటితోట క్యాంప్‌లో గతంలో ఆంజనేయస్వామివారి ఆలయం ఉండేది. ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతనంగా ఆలయం నిర్మించాలని ఆ ప్రాంతవాసులు సంకల్పించారు. దీంతో గ్రామస్థులందరూ చుట్టుపక్కల గ్రామాల దాతల సహకారంతో వినూత్నరీతిలో ఆలయాన్ని నిర్మించడానికి సంకల్పించారు. కొండరాళ్లను తెచ్చి ఆలయాలను పోలిన విధంగా ఎటువంటి సిమ్మెంటు వాడకుండా పూర్తిగా రాయిమీద రాతితోకూడిన రాళ్లతో ఆలయాలను తీర్చిదిద్దారు. మొత్తం ఆలయం పూర్తయ్యేనాటికి సుమారు 80 నుంచి 90లక్షల వరకు ఖర్చు అయినట్లు నిర్మాణ కమిటీ వారు తెలిపారు. ఇందులో ప్రతిష్ఠించే విగ్రహం కూడా సహజత్వం ఉట్టిపడేలా ఉండాలన్న సంకల్పంతో కాతేరులో రాతి విగ్రహాలకు ప్రసిద్ధి అని తెలుసుకుని అక్కడి నుంచి శిల్పాన్ని ఒక వాహనంపై ఇక్కడకుతీసుకువచ్చారు. పదో తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి 12న బుధవారం విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. బ్రమ్మశ్రీ దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



కొవ్వూరులో పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న నియోజకవర్గ ఇంచార్జి తలారి వెంకట్రావు

కొవ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూ రు వైసీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం కొవ్వూరు సత్యవతినగర్‌లోని వైసీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్ చార్జి తలారి వెంకట్రావు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. నాయకులు, కార్యకర్తలకు ఆవి ర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైసీపీ పోరుబాట కార్యక్రమానికి మోటారుసైకిళ్లపై ర్యాలీగా రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, రుత్తల భాస్కరరావు, మూడు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు నిర్మించాలి



ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కొవ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు నిర్మాణం చేపట్టాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. కొవ్వూరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో ఎటువంటి రాజకీయ ఆంక్షలు లేకుండా నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణిసుస్మితకు వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాఘవ మాట్లాడుతూ 2021లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించింది. అప్పటి నుంచి కళాశాలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపడతామని చెబుతున్నారు. కళాశాల భవన నిర్మాణాల విషయంలో ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు, సిబ్బంది అయోమయస్థితిలో ఉన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో శాశ్వత భవనాలు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి వై.ఐశ్వర్యాంబిక, విభాగ్ కన్వీనర్ సత్యసాయి పాల్గొన్నారు.